

ఒంగోలులో బాణసంచా కాల్చుతున్న అభిమానులు

విజయ సంబరం

గెలుపొందిన అభ్యర్థులకు అభినందనల వెల్లువ

తెలుగు తమ్ముళ్ల ఆనందోత్సాహాలు | భారీ విజయాలతో ఉరకలేస్తున్న ఉత్సాహం



ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో జనార్దన్‌ను కలిసి బొకేలు ఇచ్చేందుకు బారులు తీరిన కార్యకర్తలు, అభిమానులు

జిల్లాలోని తెలుగు తమ్ముళ్లు సంబరాల్లో మునిగితేలుతున్నారు. పార్టీ అభ్యర్థులు భారీ విజయాలు సాధించడంతో వారిలో ఉత్సాహం ఉరకలెత్తుతోంది. ఎక్కడ చూసినా పండగ వాతావరణం నెలకొంది. గెలుపొందిన అభ్యర్థుల ఇళ్లు, కార్యాలయాల వద్ద బుధవారం కోలాహలం కనిపించింది. పెద్దఎత్తున కార్యకర్తలు, అభిమానులు శాలువాలు, పుష్పగుచ్ఛాలు, పూలమాలలతో వచ్చి శుభాకాంక్షలతో ముంచెత్తారు. దీంతో బుధవారం ఆయా ఆప్రాంతాలు కిక్కిరిశాయి. ట్రాఫిక్ కూడా జాం అయిందంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు.

మాగుంట కార్యాలయంలో కోలాహలం

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 5: ఒంగోలు లోక్‌సభ టీడీపీ అభ్యర్థిగా గెలుపొందిన మాగుంట శ్రీనివాసులరెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. స్థానిక రామనగర్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం ఉదయం, సాయంత్రం మాగుంట, తనయుడు రాఘవరెడ్డిలను పెద్ద సంఖ్యలో శ్రేణులు కలిసి అభినందనలు తెలిపారు. ఆయా వర్గాల ప్రజలు బొకేలు, శాలువాలతో సత్కరించారు. మరోవైపు వివిధ ప్రాంతాల్లోని వేదపండితులు ఇరువురికీ ఆశీర్వచనాలు అందజేశారు. నగరానికి చెందిన పలువురు ప్రముఖులు మాగుంటను కలిసి అభినందించారు. కాగా మాగుంట గెలుపునకు పనిచేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు రాఘవరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



మార్కాపురంలో కందులపై పూలవర్షం కురిపిస్తున్న టీడీపీ శ్రేణులు



కుమారుడు రాఘవరెడ్డికి కేక్ తినిపిస్తున్న మాగుంట





ఒంగోలులో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు

ఒంగోలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లుగా సాగిన వైసీపీ అవినీతి, అరాచక పాలనలో జిల్లాలోని టీడీపీ శ్రేణులు అనేక ఇబ్బందులు పడ్డాయి. అక్రమ కేసులు, దౌర్జన్యాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. అనేకమంది ఆర్థికంగా కూడా నష్టపోయారు. అన్ని వర్గాల ప్రజలపైనా వైసీపీ ప్రభుత్వం వేధింపులు ఉన్నా టీడీపీ వారు అధికంగా ఎదుర్కోవాల్సి వచ్చింది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీని దించేయాలన్న పట్టుదలతో అందరూ కసిగా పనిచేశారు. జనసేన, బీజేపీ శ్రేణుల మద్దతుతోపాటు వివిధ వర్గాల ప్రజల్లో ఏర్పడిన వైసీపీ ప్రభుత్వ వ్యతిరేకత తోడ్పడింది. ఫలితంగా అటు రాష్ట్రంలో, ఇటు జిల్లాలో టీడీపీ భారీ విజయాలు సాధించడం ఆపార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. జిల్లాలో చూస్తే తీవ్ర ప్రతికూల వాతావరణం ఉండే ఒంగోలు పార్లమెంట్ స్థానంతోపాటు ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో ఆరుచోట్ల టీడీపీ విజయకేతనం ఎగురవేసింది. రెండుచోట్ల స్వల్ప ఓట్ల తేడాతో ఓటమిపాలైనా అక్కడా పోరాడి ఓడామన్న భావన ఉంది. ఇక గెలుపొందిన స్థానాలలో తూర్పు ప్రాంతంలో వేలాది ఓట్ల మెజారిటీలు రావడం పార్టీశ్రేణులను ఉత్సాహపరిచింది.

శుభాకాంక్షలు తెలిపేందుకు పోటెత్తారు

గెలుపొందిన అభ్యర్థులను అభినందించేందుకు వేలాదిగా పార్టీశ్రేణులు బుధవారం వారి వద్దకు తరలివచ్చారు. ఒంగోలులో భారీ మెజారిటీతో గెలుపొందిన దామచర్ల జనార్దన్‌ను అభినందించేందుకు, శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గంతోపాటు పొరుగు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున శ్రేణులు తరలివచ్చాయి. స్థానిక గుంటూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయం అభిమానులు, నాయకులతో కిటకిటలాడింది.

ఎంపీగా గెలుపొందిన మాగుంట శ్రీనివాసులరెడ్డి, కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డీఎస్‌బీవీ స్వామిలు విడివిడిగా ఉదయం అమరావతి వెళ్లి అధినేత చంద్రబాబును కలిసి మధ్యాహ్నానికి తిరిగి వచ్చారు. అనంతరం వారి నివాసాలకు పెద్దఎత్తున పార్టీశ్రేణులు వచ్చి శుభాకాంక్షలు తెలిపాయి. ఒంగోలు మంగమూరురోడ్డులోని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ నివాసం పార్టీశ్రేణులు, అభిమానులతో రద్దీగా మారింది. నియోజకవర్గంలోని అనేక గ్రామాల వారు ఉదయం నుంచే భారీగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలుపగా రద్దీ అధికం కావడంతో సాయంత్రం చీమకుర్తి వెళ్లి అక్కడి పార్టీ కార్యాలయంలో పార్టీశ్రేణులను బీఎన్ కలిశారు.





చంద్రబాబుతో మాట్లాడుతున్న ఎంపీ మాగుంట

చంద్రబాబును కలిసిన మాగుంట

ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 5 : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడిని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో బాబును కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా మాగుంట తనయుడు రాఘవరెడ్డి కూడా చంద్ర బాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కాగా ప్రముఖ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను చంద్రబాబు నివాసంలో మాగుంట కలిసి అభినందనలు తెలిపారు. మాగుంట వెంట ఆయన మరో తనయుడు నిఖిల్‌రెడ్డి కూడా ఉన్నారు.

కనిగిరిలో తిరునాళ్లను తలపించేలా..

కనిగిరిలో గెలుపొందిన డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి నివాసం, పార్టీ కార్యాలయమైన అమరావతి గ్రౌండ్స్ వద్ద తిరునాళ్ల వాతావరణం కనిపించింది. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి భారీగా శ్రేణులు తరలివచ్చాయి. అలాంటి వాతావరణమే మార్కాపురంలో గెలుపొందిన కందుల నారాయణరెడ్డి, గిద్దలూరులో విజయం సాధించిన అశోక్‌రెడ్డిల నివాసాల వద్ద కనిపించింది. పెద్దసంఖ్యలో పార్టీశ్రేణులు వచ్చి అభినందనలు తెలిపాయి. ఎర్రగొండపాలెం, దర్శిల్లో ఓటమి బాధించినా రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఆప్రాంత టీడీపీ శ్రేణులు కొంత ఊరట చెందుతున్నాయి. ఇదిలాఉండగా జిల్లాలోని అనేక గ్రామాలు, పట్టణాలలో వివిధ పేటల్లో స్థానికంగా ఎక్కడికక్కడ పార్టీశ్రేణులు పెద్దఎత్తున సంబరాలు చేసుకుంటున్నాయి. అయితే భారీ ర్యాలీలు, సభల నిర్వహణకు శ్రేణులు సిద్ధమైనా పోలీసు ఆంక్షలతో వాటిని విరమించుకున్నారు.



కనిగిరిలో ఉగ్రను కలిసి అభినందించేందుకు అమరావతి గ్రౌండ్స్‌కు తరలివచ్చిన అభిమానులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ఉగ్ర



ఒంగోలు గాంధీరోడ్డులో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నేతలు



గిద్దలూరులో అశోక్‌రెడ్డికి బొకే ఇచ్చి అభినందిస్తున్న మహిళలు



చీమకుర్తిలోని టీడీపీ కార్యాలయంలో బీఎన్‌కు బొకే ఇచ్చి అభినందిస్తున్న మహిళలు

దూసుకొచ్చిన మృత్యువు!

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం
- చెన్నరాయునిపల్లిలో విషాదం

పెద్దారవీడు, జూన్ 5: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఈ ఘటన పెద్దారవీడు మండలం గొబ్బూరు వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎర్రగొండపాలెం మండలం చెన్నరాయునిపల్లెకు చెందిన మేకల బ్రహ్మం (18), పోరెడ్డి చిన్న వెలుగొండయ్య (18) బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై మార్కాపురం వచ్చారు. పనులు పూర్తయిన అనంతరం తిరిగి చెన్నరాయునిపల్లికు వెళుతుండగా అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్సై వెంకట సైదులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మార్కాపురం సర్వజన వైద్యశాలకు వెళ్లి మృతదేహాలను పరిశీలించి నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటానని, ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.





చిన్న వెలుగొండయ్య, బ్రహ్మం మృతదేహాలు

దర్శిలోనే ఉంటా.. ప్రజలకు సేవలందిస్తా



- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జూన్ 5 : దర్శిలోనే నివాసం ఉండి ప్రజలకు సేవలందిస్తానని టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చవిచూసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన విజయం కోసం అహర్నిశలూ కృషిచేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. 40 రోజుల సమయంలోనే సొంత బిడ్డలా ఆదరించిన ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. నియోజకవర్గ సర్వతోముఖాభి వృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండి పనిచేస్తానని, ఎవ్వరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

టీడీపీకి జైకొట్టిన ఉద్యోగులు

- చెల్లినవి 20,135 పోస్టల్ బ్యాలెట్లు
- అందులో 60.72 శాతం కూటమికే
- అశోక్‌రెడ్డి గెలుపులో ఆ ఓట్లే కీలకం

ఒంగోలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రి ఎన్నికల్లో ఉద్యోగులు టీడీపీకి జై కొట్టారు. గత ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా ఓట్లు వేసిన అనేకమంది ఈసారి టీడీపీకి మద్దతుగా నిలిచారు. బ్యాలెట్ ఓట్లు పలుచోట్ల వైసీపీ కన్నా టీడీపీ అభ్యర్థులకు రెట్టింపుస్థాయిలో వచ్చాయి. అయితే కొన్నిచోట్ల వైసీపీ అభ్యర్థులు భారీగా డబ్బు పంచి ఉద్యోగుల ఓట్లు కొన్న ప్రభావం కూడా కనిపించింది. ఎన్నికల విధుల్లో కీలకమైన పోలింగ్ సిబ్బంది అలాగే రవాణా, విద్యుత్, పోలీస్ వంటి అత్యవసర సర్వీసులైన శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉంది. గతంలో ముందుగా ఎన్నికల అధికారికి దరఖాస్తు చేసుకొని బ్యాలెట్ పత్రాన్ని పొంది తమకు నచ్చిన వారికి ఓటు వేసి కవర్‌ను ఆర్వో కార్యాలయంలో ఇచ్చేవారు. ఆ సమయంలో పోటీలో ఉన్న అభ్యర్థులు పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కొనుగోలు చేసి వారి సమక్షంలో ఓటు వేయించుకునేవారు. తర్వాత సదరు కవర్‌ను ఆ ఉద్యోగి లేదా కొనుగోలు చేసిన పార్టీ తరఫు వారు తీసుకెళ్లి ఆర్వో కార్యాలయంలో ఏర్పాటుచేసిన బాక్సులో వేసేవారు. ఇది అధికార పార్టీకి అనుకూలంగా పనిచేసేది. అయితే ఈసారి ఎన్నికల సంఘం నిబంధనలను మార్చింది. పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రత్యేకంగా మూడు రోజులపాటు నియోజకవర్గ కేంద్రాలలో పోలింగ్ నిర్వహించింది. ఆ పరిధిలోని వారే కాక రాష్ట్రంలో ఏనియోజకవర్గంలో ఓటు ఉండి ఇక్కడ పనిచేస్తూ ఎన్నికల విధుల్లో ఉన్నవారు అక్కడ పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో పాల్గొనేలా చేశారు. అలా ఇక్కడ జేసీగా ఉన్న గోపాలకృష్ణ తన సొంత ఊరు శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గ అభ్యర్థులకు ఓటు వేశారు. ఆ విషయం అలా ఉంచితే పోస్టల్ బ్యాలెట్ కలిగిన వారిలో అత్యధికులు ఈసారి టీడీపీ అభ్యర్థులకే ఓటు వేశారు.



చీమకుర్తిలో పోస్టల్ ఓట్లు వేసేందుకు బారులు తీరిన ఉద్యోగులు (ఫైల్)

కనిపించిన డబ్బు ప్రభావం

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు పోలైన పోస్టల్ బ్యాలెట్‌లలో కొద్దిసంఖ్యలో వివిధ కారణాలతో కౌంటింగ్ సమయంలో తిరస్కరణకు గురికాగా 20,135 ఓట్లు చెల్లాయి. వాటిని లెక్కించగా 13,497 (60.72శాతం) మంది టీడీపీ అభ్యర్థులకు ఓట్లు వేశారు. 8,310 (37.34శాతం) మంది వైసీపీకి మద్దతు పలికారు. గరిష్ఠంగా గిద్దలూరు, సంతనూతలపాడు, కనిగిరి నియోజకవర్గాల్లో 64 నుంచి 66 శాతం ఉద్యోగులు టీడీపీకే వేశారు. ఒంగోలుతోపాటు కొన్నిచోట్ల ఉద్యోగుల ఓట్లపై డబ్బు ప్రభావం కూడా కనిపించింది. వైసీపీ అభ్యర్థులు ఒంగోలు, దర్శి వంటి చోట్ల ఒక్కో బ్యాలెట్‌ను రూ.5వేల వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. ఆ ప్రభావంతో ఆ ప్రాంతంలో కొంతమేర ఉద్యోగుల ఓట్లు వైసీపీకి అనుకూలంగా పడినట్లు సమాచారం. మొత్తంగా అధికశాతం ఉద్యోగులు ఈసారి టీడీపీవైపే మొగ్గు చూపారు. కాగా గిద్దలూరులో టీడీపీ అభ్యర్థి గెలుపులో ఉద్యోగుల ఓట్లే కీలకమయ్యాయి. ఈవీఎంలలోని ఓట్లలో వైసీపీ ఆధిక్యత ఉండగా పోస్టల్ బ్యాలెట్‌లో వచ్చిన ఆధిక్యతతో అక్కడ టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డి గెలుపొందారు.

నియోజకవర్గాల వారీ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివరాలు

నియోజకవర్గం పేరు	చెల్లిన ఓట్లు	టీడీపీకి వచ్చినవి	వైసీపీకి వచ్చినవి
వైపాలెం	1,871	1,054	777
ఒంగోలు	4,974	2,892	1,980
కొండపి	2,157	1,364	740
సంతనూతలపాడు	2,202	1,431	720
దర్శి	2,090	1,003	962
కనిగిరి	2,705	1,742	923
మార్కాపురం	2,777	1,640	1,078
గిద్దలూరు	3,449	2,271	1,130
ఒంగోలు పార్లమెంట్	21,040	12,065	7,643


గాంధీనగర్‌లో కేక్ కట్ చేస్తున్న ఆర్యవైశ్యులు


ఎమ్మెల్యే దామచర్లకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు


ఆనందంతో చిందులు వేస్తున్న శ్రేణులు

దామచర్లకు వెల్లువెత్తిన అభిమానం!

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపేందుకు శ్రేణుల క్యూ • టీడీపీ కార్యాలయం వద్ద కార్యకర్తల సందడి

భారీగా బాణసంచాలు కాల్చిన నాయకులు • కేక్ కటింగ్‌లతో సందడి చేసిన కార్యకర్తలు

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి తిరుగులేని విజయం సాధించడంతోపాటు, ఒంగోలు శాసనసభ్యులుగా దామచర్ల జనార్దన్ 32,200 ఓట్లు ఆధిక్యంతో గెలుపు సాధించడంతో తెలుగు తమ్ముళ్లలో నూతనోత్సాహం కనిపించింది. మంగళవారం ఓట్లు లెక్కింపు ముగియడంతో దామచర్ల రాత్రి వరకు బిజీగా గడిపారు. విజయం సాధించిన టీడీపీ కూటమి అభ్యర్థులతో కలిసి ఆనందోత్సాహాలు పంచుకోగా, బుధవారం ఉదయం నుంచే ఆయన ఇంటి వద్ద అభిమానులతో సందడి నెలకొంది. దామచర్లను కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు బారులు తీరారు. అనంతరం జనార్దన్ పార్టీ కార్యాలయానికి విచ్చేశారు. దాంతో పెద్దసంఖ్యలో నగరానికి చెందిన పార్టీ శ్రేణులు, ఒంగోలు రూరల్, కొత్తపట్నం మండలం, ఇతర నాయకులతోపాటు, కార్యకర్తలు, అభిమానులు దామచర్లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో పార్టీ కార్యాలయంలో పండుగ వాతావరణం కనిపించింది. ఈ గెలుపు తన ఒక్కడిదే కాదని, ఈ ప్రజా విజయాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతిస్తూ సంతోషాలు పంచుకోవడం తనకు ఆనందంగా ఉందని దామచర్ల తెలిపారు. ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.

తిరుమలకు దామచర్ల పయనం

ఒంగోలు ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలుపొందిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ బుధవారం సాయంత్రం నుంచి తిరుమల బయలుదేరి వెళ్లారు. కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లిన దామచర్ల శ్రీవేంకటేశ్వర స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తిరిగి గురువారం సాయంత్రానికి దామచర్ల ఒంగోలు చేరుకుంటారని కార్యాలయ ప్రతినిధులు వెల్లడించారు.

శ్రేణుల సంబరాలు

సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ ఎమ్మెల్యేగా విజయం సాధించడంపై నియోజకవర్గంలో పార్టీ శ్రేణులతోపాటు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక మెజారిటీ సాధించడంతో నగరమంతా టీడీపీ శ్రేణుల కేరింతలతో మారు మోగింది. ఐదేళ్ల కష్టం, పార్టీ కోసం పనిచేసిన శ్రమ వృధాగా పోలేదని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా దామచర్ల గెలుపుపై టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక గాంధీ రోడ్‌లో, టీడీపీ వాణిజ్య విభాగం నాయకులు కొల్లిపల్లి సురేష్ ఆధ్వర్యంలో భారీగా సంబరాలు జరుపుకున్నారు. 162 కేజీల కేక్‌ను కట్ చేసి, బాణసంచాలు కాలుస్తూ మేళతాళాలతో సందడి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, టీవీ.శ్రీరామ్మూర్తి, పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి, మేల తిరుమల, తాతా చెంచయ్య గుప్తా, కొల్లిపల్లి హనీష్, కొప్పురావూరి సురేష్, పబ్బిశెట్టి భాస్కర్, పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు. అలాగే గోల్డ్ అండ్ సిల్వర్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు తాతా ప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంతోషాలు పంచుకున్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేగా దామచర్ల జనార్దన్ గెలుపు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచుకున్నారు.

అలాగే స్థానిక కేశవ స్వామి పేటలో ఏర్పాటు చేసిన వేడుకలలో జూటూరి కృష్ణ, దండూరి శంకర్‌రావు, గండికోట నారాయణ, కోటయ్య, సాయి, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు. అలాగే స్థానిక చెన్నకేశవస్వామి లేఅవుట్ పార్కులో సంబరాలు జరుపుకున్నారు. కార్పొరేటర్ చెన్నుపాటి వేణు, నాయకులు చెన్నుపాటి వరప్రసాద్, గణపతి మాస్టర్, కుర్రా భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు. 21డివిజన్‌లో దామచర్ల గెలుపు సంబరాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. నాయకులు పొన్నరసు మురళీ కృష్ణ, శ్రీహరి, యలమల సురేష్, కుప్పల రాజీవ్, కోయ కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ డివిజన్‌లో వైసీపీపై 680 మెజారిటీ సాధించడంపై కేరింతలు కొట్టారు.


చెన్నకేశవస్వామి లేఅవుట్ పార్కులో..

నీట్‌లో మైత్రి విద్యార్థుల ప్రభంజనం



ముష్కాన్‌అఫ్రీన్, వైష్ణవితులసీ

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 5: ఒంగోలులోని మైత్రీ నీట్ అకాడమీ విద్యార్థులు నీట్‌లో ప్రభంజనం సృష్టించారు. ఎంబీబీఎస్, బీడీఎస్, వెటర్నరీ సీట్లు సాధించినట్లు అకాడమీ డైరెక్టర్ ఎస్.రామారావు బుధవారం తెలిపారు. 720 మార్కులకు గాను తమ విద్యార్థులు ఏఎస్.వైష్ణవితులసీ(654) జిల్లాలో మొదటి ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే ముష్కాన్‌అఫ్రీన్ (609), కె.మల్లికార్జున(581), కె.చందన(553), ఎం.పావని(550), టి.దుర్గవినూత్న(534), ఎం.సాయిసిరిచందన (529), బి.నిత్యశ్రీ(519), సీహెచ్.కోటిరెడ్డి(518), కె.సమీక్ష(509), కె.మనోజ్ఞ(507) ఉత్తమ మార్కులు సాధించారు. 600లకు పైగా ఇద్దరు, 500లకు పైగా 10 మంది, 400లకు పైగా 13 మంది విద్యార్థులు మార్కులు సాధించారని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను డైరెక్టర్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

కూటమి విజయంతో శివంలో సంబరాలు


కేక్ కట్ చేస్తున్న అతిథులు

ఒంగోలు(కల్చరల్), జూన్ 5: సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ కూటమి అఖండ విజయాన్ని సాధించిన సందర్భంగా స్థానిక సంతపేట శివం శరణాలయంలో బుధవారం సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి ఆధ్వర్యంలో పలువురు అతిథులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొమ్మి రమణయ్య, మన్నం శేషయ్య తదితరులు మాట్లాడుతూ ఒంగోలు ఎమ్మెల్యేగా దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యేగా బీఎన్.విజయ్‌కుమార్‌లు భారీ మెజార్టీతో గెలుపొందటం ఎంతో ఆనందంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో వడ్డెంపూడి సుజాత, వి.నరసింహారావు, కంది మురళి, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన గంజాయి మూక అరెస్టు

ఒంగోలు(క్రైం), జూన్ 5: యువతిని అల్లరి చేస్తున్న మూకను ప్రశ్నించిన వారిపై విచక్షణా రహితంగా దాడిచేసిన ఐదుగురుని ఒంగోలు వన్‌టౌన్ సీఐ అలీసాహెబ్ తన సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. గత నెల 25 ఒంగోలులోని శర్మాకాలేజీ వద్ద పూజల దేవ, ఆయన కుమారుడు సుబ్రహ్మణ్యంలపై దాడి చేసిన జక్రయ్య ఆసుపత్రి వద్ద నివాసం ఉండే రోహిత్, అతని తండ్రి వెంకయ్య, నందనం దుర్గాప్రసాద్, ధనిశెట్టి జానకీరామ్, ముద్రబోయిన భానుప్రసాద్‌లను రంగారాయుడు చెరువు సమీపంలో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. అంతేగాకుండా కేసును హత్యాయత్నం కేసుగా మార్పు చేశామని ఆయన చెప్పారు.

కొండపిలో క్రాస్ ఓటింగ్ !

• మెజారిటీల్లో స్వామికి, మాగుంటకు వ్యత్యాసం

కొండపి, జూన్ 5 : కొండపి నియోజవకర్గంలో క్రాస్ ఓటింగ్ జరిగింది. ఈవీఎంల ఓట్లలో టీడీపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డికి వచ్చిన ఓట్లలో వ్యత్యాసం ఉంది. మాగుంట కంటే స్వామికి 4,669 ఓట్లు ఎక్కువ వచ్చాయి. నియోజకవర్గంలో స్వామికి మొత్తం 24,132 ఓట్ల ఆధిక్యం రాగా, మాగుంటకు 19,463 ఓట్ల మెజారిటీ లభించింది.

నోటా కన్నా కాంగ్రెస్ అభ్యర్థికి 52 ఓట్లు అధికం : నియోజకవర్గంలో నోటా కన్నా కాంగ్రెస్ అభ్యర్థికి 52 ఓట్లు అధికంగా వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి పసుమర్తి సుధాకర్‌రావుకు ఈవీఎం ఓట్ల ద్వారా 1,652ఓట్లు లభించగా నోటాకు 1,600 ఓట్లు వచ్చాయి. బీఎస్పీ అభ్యర్థిని రావినూతల మాతృకకు 714 ఓట్లు పడ్డాయి. మంత్రి సురేష్ తనపై అక్రమంగా ఎస్సీ కేసు పెట్టించారని ఆరోపిస్తూ ఆయన ఓటమే లక్ష్యంగా నామినేషన్ వేసిన టంగుటూరుకు చెందిన విఘ్నం సుజాతకు 249 ఓట్లు వచ్చాయి.

పోస్టల్ బ్యాలెట్లలో స్వామికి 624 ఓట్ల మెజారిటీ

• నోటాకు 12 ఓట్లు

కొండపి, జూన్ 5 : కొండపి నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్లు 2,271 పోల్ అయ్యాయి. వీటిలో టీడీపీ కూటమి అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి 1,364 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి సురేష్‌కు 740 వచ్చాయి. దీంతో స్వామి 624 ఓట్ల మెజారిటీ సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి పసుమర్తి సుధాకర్‌రావుకు 14 ఓట్లు వచ్చాయి. బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి రావినూతల మాతృకకు 14, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేడ్కర్) అభ్యర్థి రావూరి లక్ష్మణరావుకు ఆరు ఓట్లు లభించాయి. వీసీకే పార్టీ అభ్యర్థి అంబటి కొండలరావుకు మూడు, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కనపర్తి శివరాంకు మూడు, పిరమిడ్ పార్టీ అభ్యర్థి మెండా బాలకోటయ్యకు ఒకటి, నోటాకు 12 ఓట్లు వచ్చాయి. 114 ఓట్లు ఇన్‌వాలిడ్, రిజక్ట్ అయ్యాయి.


ఎమ్మెల్యే బీఎన్‌ను సత్కరిస్తున్న సంతనూతలపాడు నాయకులు


కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్


చీమకుర్తిలో బీఎన్‌ను సత్కరిస్తున్న కౌన్సిలర్లు, మహిళలు


నాపై మరింత బాధ్యత పెరిగింది

ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ • బీఎన్‌కు శ్రేణుల ఘన సత్కారాలు

సంతనూతలపాడు, జూన్ 5: సంతనూతలపాడు నియోజకవర్గ ప్రజలు ఎన్నికల్లో ఊహించని మెజార్టీ అందించి తనపై మరింత బాధ్యతను పెంచారని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. తమ ఆత్మీయనాయకుడికి అభినందనలు తెలిపేందుకు సంతనూతలపాడు టీడీపీ నాయకులు పలువురు ఒంగోలులోని బీఎన్ నివాసంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను ఘనంగా దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు తన్నీరుశ్రీను, నలమోతు శ్రీను, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను నాయకులు బొమ్మినేని రామాంజనేయులు, ఆర్.సురేష్, డి.అనీల్, ఎస్.కొండలు తదితరులు కలిసి అభినందించారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించిన తర్వాత తొలిసారి చీమకుర్తి పట్టణానికి విచ్చేసిన తమ అభిమాన నాయకుడు బీఎన్.విజయ్‌కుమార్‌కు టీడీపీ శ్రేణుల నుంచి ఘనస్వాగతం లభించింది. స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో కేక్ కట్ చేసి తన గెలుపునకు కృషి చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. 20 ఏళ్ల తర్వాత సంతనూతలపాడు నియోజకవర్గంలో టీడీపీ భారీ మెజార్టీతో గెలవటం ఆనందంగా ఉందన్నారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. గజమాలతో నాయకులు, మహిళలు విజయ్‌కుమార్‌ని సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు అడకా స్వాములు, కాట్రగడ్డ రమణయ్య, కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజనీ, గంగుల శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.


బీఎన్‌కు బొకేలు అందజేస్తున్న మద్దిపాడు మండల నాయకులు

బీఎన్‌కు శ్రేణుల శుభాకాంక్షలు

మద్దిపాడు: సంతనూతలపాడు ఎమ్మెల్యేగా బీఎన్.విజయ్‌కుమార్ విజయం సాధించడంపై కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మద్దిపాడు మండలంలో 5,190 ఓట్లు మెజార్టీ రావడంతో తెలుగు తమ్ముళ్ల సంబరాలు మిన్నంటాయి. బుధవారం ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు ఆధ్వర్యంలో బసవన్నపాలెం దళితవాడ పార్టీ కార్యకర్తలు కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నాగన్నపాలెం, ఇనమనమెళ్లూరు, ఏడుగుండ్లపాడు, వెల్లంపల్లి, లింగంగుంట, పెద్దకొత్తపల్లి, నందిపాడు గ్రామాల కార్యకర్తలు సైతం బీఎన్‌ను కలిసి అభినందించారు.

టీడీపీ నాయకుల నివాళులు

నాగులుప్పలపాడు, జూన్ 5: ఉప్పుగుండూరులోని దళిత కాలనికి చెందిన టీడీపీ కార్యకర్త కత్తి యశ్వంత్(25) గుండె పోటుతో మృతి చెందారు. దీంతో సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బీఎన్ సోదరుడు బొమ్మాజి అనిల్, మండల టీడీపీ అధ్యక్షుడు తేళ్ళ మనోజ్‌కుమార్ బుధవారం యశ్వంత్ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. టీడీపీ నాయకులు కాట్రగడ్డ చంద్రబాబు, కనగాల శ్రీనివాసరావు, సెల్వం, తెలగతోటి జాన్సన్, తిరుమలశెట్టి శ్రీను, కొలకలూరి నాగార్జున, జనసేన నాయకులు పెంట్యాల కోటి, బాలిశెట్టి నాగేశ్వరరావు, ధనుష్, పెంట్యాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

మద్దిపాడు, జూన్ 5: మద్దిపాడు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు స్కూటీపై వస్తుండగా వ్యాన్ అదుపుతప్పి వారిని ఢీకొంది. దీంతో నేలటూరుకు చెందిన కుంచాల వాసు, శ్రీకాకుళంకు చెందిన రమేష్‌రెడ్డికి గాయాలు కాగా 108లో క్షతగాత్రులను ఒంగోలుకు తరలించారు. ఎస్సై మహేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దామచర్లకు మంత్రి పదవి ఇవ్వాలి

ఒంగోలులో జరిగిన అవినీతిపై సిట్ వేయాలి • టీడీపీ నేత సుబ్బారావుగుప్తా డిమాండ్

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 5 : ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు మంత్రి ఇవ్వాలని టీడీపీ నాయకుడు సుబ్బారావుగుప్తా కోరారు. ఒంగోలులోని ఓ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న దామచర్ల జనార్ధన్‌కు మంత్రి పదవి ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఎంత వత్తిడి ఉన్నా టీడీపీలోనే ఉంటూ పార్టీ బలోపేతం కోసం దామచర్ల చేసిన కృషి ఎంతో ఉందని చెప్పారు. మరో వైపు గత వైసీపీ ప్రభుత్వంలో ఒంగోలులో జరిగిన భూముల అవినీతి, అక్రమాలపై సిట్ వేయించి దోషులను జైలుకు పంపాలన్నారు. మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పలు అవినీతి, ఆరోపణలు చేశారు. తనను అనేక ఇబ్బందులు పెట్టిన అధికారుల పేర్లు రెడ్‌బుక్‌లో ఉన్నాయని, వారందరిపై చర్యలు తప్పవన్నారు. మాజీమంత్రి బాలినేని, ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డిలు చేసిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న డీఈవో సుభద్ర

ఒంగోలు(విద్య), జూన్ 5: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని డీఈవో డి.సుభద్ర పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక బండ్లమిట్టలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకోసం గ్రామ స్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పర్యావరణ హితానికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడక నిషేధించాలని, వాటి స్థానంలో క్లాత్ బ్యాగులను వాడాలని కోరారు. నీటిని సంరక్షించే వ్యవసాయ పద్ధతులు పాటించాలని, ఈనెల 12నుంచి 19వ తేదీ వరకు పాఠశాలల్లో ఏకో క్లబ్బుల ద్వారా పర్యావరణ హిత జీవనశైలి కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణకుమారి, డీఐఈవో శ్రీనివాసరావు, ఎంఈవో డి.వెంకారెడ్డి, సీఎంవో బీఏ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

మద్దిపాడు మండలంలో బీఎన్‌కు ఆధిక్యత

మద్దిపాడు, జూన్ 5: ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యేగా బీఎన్.విజయ్‌కుమార్ విజయం సాధించారు. ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ సమీప అభ్యర్థి మంత్రి మేరుగనాగార్జునపై మద్దిపాడు మండలంలో తొలి నుంచి ఆధిక్యం ప్రదర్శించారు. మండలంలో మొత్తం 54,768 మంది ఓటుహక్కు వినియోగించుకోగా, వారిలో పురుషులు 26,487, స్త్రీలు 28,881 మంది ఉన్నారు. మండలంలో 54 పోలింగ్ బూత్‌లు ఉండగా, దాదాపు అన్ని బూత్‌లలో బీఎన్ ఆధిక్యత కొనసాగింది. దొడ్డవరం, మల్లవరం, అన్నంగి, కొటచనకోట, వెల్లంపల్లిలో టీడీపీ ఆధిక్యం ప్రదర్శించింది. నాగన్నపాలెం, కీర్తిపాడు, నందిపాడు, బసవన్నపాలెం, ఇనమనమెళ్లూరు, సీతారాంపురంలలో టీడీపీకి ఆధిక్యత వచ్చింది. అలాగే ఘడియపూడి రెండు కాలనీల్లోనూ తెలుగుదేశంకు మెజార్టీ లభించింది. ఇక బూరేపల్లి, గుండ్లాపల్లిలో, రాచవారిపాలెంలో వైసీపీకి ఆధిక్యం వచ్చింది. మద్దిపాడులోని 161వ బూతులో టీడీపీకి 330 రాగా, వైసీపీకి 201 ఓట్లు లభించాయి. కాగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు ఆధ్వర్యంలో ఆనందోత్సవాలు జరుపుకున్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 5: ప్రకృతికి సవాలుగా మారి మానవ ప్రాణాలు హరిస్తున్న ప్లాస్టిక్‌ను నిర్మూలించడంలో ప్రజలు ప్రత్యక్ష ఉద్యమాన్ని చేయాల్సిన అవసరం ఉందని పర్యావరణ పరిరక్షణ సంస్థ చైర్మన్ జి.వీరభద్రాచారి పేర్కొన్నారు. ఒంగోలులోని సంస్థ కార్యాలయంలో పర్యావరణ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ప్రసాద్, మధు, ఈశ్వరయ్య అమన్, అజయ్, భువన తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ ఆధ్వర్యంలో..

ఒంగోలు(కల్చరల్): మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఆలిండియా మహాత్మా సోషల్ క్లబ్ (ఎయిమ్స్) పూర్వ జాతీయ అధ్యక్షులు రాధారమణ గుప్తా జంధ్యం పేర్కొన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక అద్దంకి బస్టాండ్ దగ్గర మొక్కల పంపిణీ కార్యక్రమం క్లబ్ కోశాధికారి ధనిశెట్టి రామునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో తుమ్మపూడి బుచ్చిబాబు, శెనిగేపల్లి నాగాంజనేయులు, తీగల సత్యవతి, కటకం నాగేశ్వరరావు, కనియంపాటి మల్లిఖార్జున, కోటి మొక్కల మహాయజ్ఞం నిర్వాహకులు దొడ్డాల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో

నాగులుప్పలపాడు: పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఐటీసీ సహకారంతో గ్రామసిరి సంస్థ ఆధ్వర్యంలో నాగులుప్పలపాడు పశువైద్యశాల ఆవరణలో ఏడీఏ నాగభూషణరావు మొక్కలు నాటారు. పశువైద్యులు జీవీ.సురేఖ, కోఆర్డినేటర్ వాటుపల్లి బసవయ్య, సభ్యులు మస్తాన్‌వలి, కోటి రవి, ఫీల్డ్‌అసిస్టెంట్ మధు పాల్గొన్నారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: మొక్కలు పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమని మద్దిపాడులోని కడియాల యానాదయ్య హైస్కూలు హెచ్ఎం పెద్దిరెడ్డి కోటిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పాఠశాల ఆవరణలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అలాగే అమృత సరోవర్ పథకం కింద లింగంగుంట చెరువు కట్టపై ఎన్ఆర్ఈజీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.అర్జున్‌రావు బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్లతోట పెంపకం కోసం ఐదు ఎకరాల లోపు రైతులు అర్హులన్నారు. ప్లాంటేషన్ మేనేజర్ సంజీవరావు, ఏపీవో ధనుంజయ వర్మ, జేఈ కిషోర్‌కుమార్, ఏపీడీ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పీఎంశ్రీ ఫేజ్-1 స్కూల్స్ ఆడిట్ : డీఈవో

ఒంగోలు(విద్య), జూన్ 5: జిల్లాలో పీఎంశ్రీ ఫేజ్-1 కింద మంజూరైన 41 పాఠశాలల ఆడిట్ గురువారం నుంచి మూడు రోజుల పాటు జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాలలకు సంబంధించి ప్లేగ్రౌండ్, కెమిస్ట్రీ ల్యాబ్‌లకు విడుదలైన నిధుల వినియోగంపై ఆడిట్ ఉంటుందని పేర్కొన్నారు. 6న ఒంగోలు ఎంఈవో కార్యాలయంలో, 7న మార్కాపురం మండల విద్యాధికారి కార్యాలయంలో, 8న కనిగిరి ఎంఈవో కార్యాలయంలో ఆడిట్ ఉంటుందని, ఆడిట్ సిబ్బందితో ఎంఈవోలు సమన్వయం చేసుకోవాలన్నారు. పీఎం శ్రీ పాఠశాలల హెచ్ఎంలు తప్పనిసరిగా నిధులకు సంబంధించిన వివరాలతో ఆడిట్ చేయించుకోవాలని డీఈవో కోరారు.

గిద్దలూరులో టీడీపీ హవా

● మున్సిపాల్టీలో ముత్తుములకు బ్రహ్మారథం

గిద్దలూరు, జూన్ 5 : గిద్దలూరు మండలంలో తెలుగుదేశం పార్టీ తన సత్తా చాటుకున్నది. గిద్దలూరు మున్సిపాలిటి తెలుగుదేశం ఉమ్మడి అభ్యర్థి ముత్తముల అశోక్‌రెడ్డికి బ్రహ్మారథం పట్టగా రూరల్ మండలంలో మాత్రం వైసీపీకి స్వల్ప ఆధిక్యత లభించింది. అయితే 10 పంచాయతీలలో తెలుగుదేశం అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డికి మెజారిటీ లభించింది. గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో 31 పోలింగ్ బూతులలో 27 బూతులలో తెలుగుదేశం పార్టీకి మెజారిటీ లభించగా కేవలం 4 బూతులలో మాత్రమే వైసీపీ అభ్యర్థికి మెజారిటీ లభించింది. గిద్దలూరు మున్సిపాలిటీ మొత్తం మీద తెలుగుదేశం పార్టీ 3,622 ఓట్ల మెజారిటీ సాధించింది. అలాగే రూరల్ మండలంలో వైసీపీకి కేవలం 395 ఓట్ల మెజారిటీ మాత్రమే లభించింది. రూరల్ మండల విషయానికి వస్తే 10 పంచాయతీలలో తెలుగుదేశం మెజారిటీ సాధించగా 9 పంచాయతీలలో వైసీపీకి మెజారిటీ లభించింది. తెలుగుదేశం అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డికి వెల్లుపల్లి పంచాయతీలో 54 ఓట్లు, జయరాంపురంలో 30 ఓట్లు, తిమ్మాపురంలో 192 ఓట్లు, కెఎస్‌పల్లిలో 48 ఓట్లు, తంబళ్ళపల్లిలో 47 ఓట్లు, కొంగళవీడులో 210 ఓట్లు, కొత్తకోటలో 163 ఓట్లు, సంజీవరాయునిపేటలో 104 ఓట్లు, గడికోట పంచాయతీలో 105 ఓట్ల ఆధిక్యత టీడీపీకి లభించింది. వైసీపీ అభ్యర్థి కె.నాగార్జునరెడ్డికి అంబవరంలో 88 ఓట్లు, దిగుమెట్టలో 15 ఓట్లు, నరవలో 257 ఓట్లు, పొదలకొండపల్లిలో 334 ఓట్లు, కంచిపల్లిలో 29 ఓట్లు, కొమ్మునూరులో 142 ఓట్లు, ఓబులాపురంలో 457 ఓట్లు, ఉయ్యాలవాడలో 256 ఓట్లు, ఆదిమూర్తిపల్లిలో 111 ఓట్ల ఆధిక్యత వైసీపీకి లభించింది.


బేస్తవారపేటలో ముత్తుముల అశోక్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బేస్తవారపేటలో ఘనస్వాగతం

బేస్తవారపేట : గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ముత్తుముల అశోక్‌రెడ్డి విజయం సాధించి ఒంగోలు నుంచి బుధవారం ఉదయం బేస్తవారపేట రావడంతో కార్యకర్తలు,అభిమానులు.నాయకులు ఘనస్వాగతం పలికారు. ముత్తుముల అశోక్‌రెడ్డికి పూలమాలలతో సత్కరించారు. రాక్షస పాలనకు స్వస్థి చెప్పామని గిద్దలూరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలని అశోక్‌రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తానని, ముఖ్యమంత్రి వద్దకు సమస్యలు తీసుకెళ్లి మరిన్ని నిధులతో అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో పూనూరు జగన్మోహన్ రెడ్డి, పూనూరు భూపాల్‌రెడ్డి, తిగిరెడ్డి భూపాల్‌రెడ్డి, దూదెకుల ఆదాం, సత్యేలి కృష్ణ, మూప్పూరి రాము తదితరులు పాల్గొన్నారు.

సొంతూరులో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కొమరోలు : మండలంలోని హనుమంతురాయునిపల్లి గ్రామంలోని శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ముత్తుముల అశోక్‌రెడ్డి విజయం సాధించడంతో బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అశోక్‌రెడ్డి స్వగ్రామమైన హనుమంతురాయునిపల్లిలోని సొంత దేవాలయమైన శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అశోక్‌రెడ్డి ఒంగోలులో కౌంటింగ్ ప్రక్రియ ముగించుకుని నేరుగా కొమరోలు మండలంలోని స్వగ్రామమైన హనుమంతురాయునిపల్లి గ్రామంలో కులదైవమైన ఆంజనేయస్వామి గుడికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుతీర్చుకున్నారు. తొలిసారిగా మండలానికి వచ్చిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని నాయకులు, కార్యకర్తలు కలసి శుభాకాంక్షలు తెలియచేశారు.

పోస్టల్ బ్యాలెట్లలోనూ టీడీపీదే హవా

అశోక్‌రెడ్డికి మద్దతు తెలిపిన ఉద్యోగులు, మిలటరీ ఉద్యోగులు

గిద్దలూరు, జూన్ 5 : గిద్దలూరు నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్‌లో సైతం తెలుగుదేశం పార్టీ హవా కొనసాగింది. ఇటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, అత్యవసర సేవల్లో పని చేస్తున్న ఉద్యోగులు, అలాగే రక్షణశాఖలో పని చేస్తున్న ఉద్యోగుల పోస్టల్ ఓట్లలో టీడీపీకి మెజారిటీ లభించింది. మొత్తం అన్ని విభాగాలలోని పోస్టల్ ఓట్లు నియోజకవర్గంలో 4,716 పోలయ్యాయి. ఇందులో 161 ఓట్లను రిటర్నింగ్ అధికారి నిరాకరించారు. దాంతో 4,555 ఓట్లు 5 రౌండ్లలో కౌంటింగ్ చేశారు. తెలుగుదేశం అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డికి 2,855 ఓట్లు లభించాయి. వైసీపీ అభ్యర్థి కుందురు నాగార్జునరెడ్డికి 1,490 ఓట్లు లభించాయి. దాంతో 1,365 ఓట్ల మెజారిటీ అశోక్‌రెడ్డికి పోస్టల్ బ్యాలెట్‌లో లభించింది. 284 ఈవీఎంల ద్వారా వచ్చిన ఓట్లలో వైసీపీ అభ్యర్థి కుందురు నాగార్జునరెడ్డికి 392 ఓట్లు మెజారిటీ ఉండగా పోస్టల్ బ్యాలెట్‌లో 1,365 ఓట్లు అశోక్‌రెడ్డికి మెజారిటీ లభించడంతో మొత్తం 973 ఓట్ల మెజారిటీతో తెలుగుదేశం అభ్యర్థి అశోక్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. బరిలో 21 మంది అభ్యర్థులు ఉండగా కేవలం ఇద్దరికి మినహా ప్రతి ఒక్కరికి ఎన్నో కొన్ని పోస్టల్ బ్యాలెట్లు పోల్ కావడం విశేషం. కాంగ్రెస్ అభ్యర్థిపగడాల పెద్దరంగస్వామికి 120 ఓట్లు పోలు కాగా బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థి ఇసుకల జయరాజ్‌కు 27 ఓట్లు పోలయ్యాయి. తెలుగు రాజ్యాధికార సమితి అభ్యర్థి చింతా శ్యాంసన్‌కు 4 ఓట్లు, పిరమిడ్ పార్టీ అభ్యర్థి పవన్‌కుమార్‌కు 5 ఓట్లు, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఠాకూర్ నాయక్‌కు ఒక ఓటు, జై భీంపార్టీ అభ్యర్థి బాబూరావుకు 4 ఓట్లు లభించాయి. స్వతంత్ర అభ్యర్థి కె.నరసింహులుకు 6 ఓట్లు, గ్లాసు గుర్తు కేటాయింపబడిన పరిసనేని వెంకటేశ్వర్లుకు 5 ఓట్లు, పిడతల రమేష్‌రెడ్డికి 3 ఓట్లు, బట్టపోతుల ఓబులేసుకు 3 ఓట్లు, బాలసాని మాల్యాద్రిరెడ్డికి 2 ఓట్లు, బొంతా రంగారెడ్డికి ఒక ఓటు, బొర్రా రాఘవేంద్రయాదవ్‌కు 3 ఓట్లు, ముడియం వెంకటరామిరెడ్డికి,ఎం.లక్ష్మీనాయక్, వరికుంట్ల ప్రసాద్‌లకు ఒక్కొక్క ఓటు, వీరంరెడ్డి ఉషారాణికి 5 ఓట్లు పోలయ్యాయి. నోటాకు 18 ఓట్లు లభించగా తమ్మిదాల కోటేశ్వర్ రెడ్డి, మీనిగ మురళి మోహన్‌రెడ్డిలకు ఒక్క ఓటూ పోలు కాలేదు.


ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న మహిళలు

ప్రతి గ్రామంలో అశోక్‌రెడ్డికి ఘన స్వాగతం

గిద్దలూరు టౌన్, జూన్ 5 : వైసీపీ కంచుకోటను బద్దలు కొట్టి రెండు దశాబ్దాల తరువాత తెలుగుదేశం పార్టీ జెండాను రెపరెపలాడించి ఎమ్మెల్యేగా ఎన్నికైన ముత్తుముల అశోక్‌రెడ్డికి పార్టీ శ్రేణులు, ప్రజలు, మహిళలు ఘనంగా స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. మంగళవారం కౌంటింగ్ పూర్తి అయిన తరువాత బుధవారం ఉదయం ఒంగోలు నుంచి ముత్తుముల గిద్దలూరు చేరుకున్నారు. పెద్దఓబినేనిపల్లె నుంచి గిద్దలూరు వరకు బేస్తవారపేట జంక్షన్, తాటిచెర్లమోటు, దద్దవాడ, తదితర అన్ని గ్రామాలలో దారి పొడవునా పార్టీ శ్రేణులు, ప్రజలు రోడ్డు మీదకు చేరుకుని ఆయన కాన్వాయ్‌కి స్వాగతం పలికి అశోక్‌రెడ్డిని పూలమాలలతో ముంచెత్తారు. గిద్దలూరు పట్టణ శివార్ల నుంచి ఆయన ఇంటి వరకు మధ్యమధ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు కారు ఆపి అభినందనలు తెలిపారు. ప్రశాంత్‌నగర్‌లోని ఆయన ఇంటి పరిసర వీధులన్నీ పార్టీ శ్రేణులతో కిటకిటలాడాయి. టీడీపీ జిందాబాద్, అశోక్‌రెడ్డి జిందాబాద్ అంటూ నినాదాలు చేయగా ఆప్రాంతమంతా మారుమోగింది. వేదపండితుల పూజ అనంతరం అశోక్‌రెడ్డి ఇంటిలోకి వెళ్ళారు. ఆయన సతీమణి పుష్పలీల ఆయనకు దిష్టి తీశారు. 6 మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు అశోక్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని పాతాళ నాగేశ్వరస్వామి దేవస్థానంలో, అభయాంజనేయస్వామి దేవాలయంలో అశోక్‌రెడ్డి విజయంతో 116 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు.

అంబరాన్ని అంటిన సంబరాలు


పొదిలిలో తమ అభిమాన నాయకునికి స్వీట్స్ తినిపిస్తున్న కార్యకర్తలు

జనసంద్రమైన జవహర్‌నగర్ కాలనీ

ఎమ్మెల్యే కందులను కలిసిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

మార్కాపురం, జూన్ 5: టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో బుధవారం స్థానిక జవహర్‌నగర్ కాలనీ జనసంద్రమైంది. సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు వేలాది మంది తరలివచ్చారు. దీంతో కళాశాల రోడ్డులోని ప్రధాన రహదారితోపాటు జవహనర్‌కాలనీలోని వీధులలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎమ్మెల్యే నారాయణరెడ్డిని కలిసి పూలమాలలు వేసి, బొకేలు, దుశ్శాలువాలు కప్పి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంతోషాన్ని పంచుకున్నారు. 22 సంవత్సరాల నుంచి రాజకీయాల్లో ఉన్నా ఎప్పుడేలేనంతగా ఈసారి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి మంచి మెజార్టీ రావడంతో కార్యకర్తల ఆనందానికి అవధులులేకుండా పోయింది. 2009లో ఎమ్మెల్యేగా గెలిచినా అప్పట్లో ప్రభుత్వం రాలేదు. కానీ ఈసారి తెలుగుదేశం పార్టీ విజయఢంకా మోగించడంతోపాటు ఎమ్మెల్యేగా మార్కాపురం నుంచి మంచి మెజారిటీతో గెలవడం వారి సంతోషానికి కారణమైంది. ఉదయం 6.00 గంటల నుంచే నారాయణరెడ్డి ఇంటికి కార్యకర్తలు పోటెత్తారు. ఒకవైపు ఆరోగ్యం సహకరించకున్నా ఇంటికి వచ్చిన వారందరినీ ఆప్యాయంగా పలకరించి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన్ను కలిసిన వారిలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పీవీ కృష్ణారావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాకర్ల శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షులు జవ్వాజి రామాంజులరెడ్డి, ఉడుముల చిన్నపరెడ్డి, కౌన్సిలర్లు నాలి కొండయ్య, మల్లికార్జున్, తర్లుపాడు మాజీ ఎంపీపీ పి.ఏసుదాసు, మాజీ జడ్పీటీసీ రావి భాషాపతిరెడ్డి, మాలపాటి వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్న కందుల


కుమారుడితో సంతోషాన్ని పంచుకుంటున్న నారాయణరెడ్డి మాతృమూర్తి నారాయణమ్మ

మార్కాపురం, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటికి చేరుకున్న కందుల నారాయణరెడ్డికి కుటుంబ సభ్యులు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన తల్లిదండ్రులు నారాయణరెడ్డి, నారాయణమ్మల ఆశీస్సులు తీసుకున్నారు. కందుల సతీమణి వసంతలక్ష్మి, కుమారుడు విఘ్నేష్ రెడ్డి, కుమార్తె నందినలతో గెలుపు సంతోషాన్ని పంచుకున్నారు. అదే విధంగా సోదరులు రామిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, చెల్లెలు లక్ష్మి, బావ భూపాల్‌రెడ్డిలతో పాటు కుటుంబ సభ్యులంతా ఇంటికి చేరుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది.

చెన్నకేశవస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల ఫలితాలలో విజయం సాధించి మార్కాపురం శాసనసభ్యునిగా ఎన్నికైన కందుల నారాయణరెడ్డి బుధవారం శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో చెన్నకేశవస్వామి మూలవిరాట్ శ్రీదేవి,భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులు రాజ్యలక్ష్మీ అమ్మవారి మూలవిరాట్ ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యులు పూజలు నిర్వహించారు. స్థానిక జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో నారాయణరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భాన్ని పురస్కరించుకుని టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం నియోజకవర్గంలో రౌండ్ల వారీ మెజారిటీ వివరాలు

రౌండ్	టీడీపీ	వైసీపీ	మెజార్టీ
1	5165	4136	1029(టీడీపీ)
2	5194	4527	667(టీడీపీ)
3	5442	3873	1569(టీడీపీ)
4	5590	4296	1294(టీడీపీ)
5	7198	4310	2888(టీడీపీ)
6	6843	4415	2428(టీడీపీ)
7	5492	6261	769(వైసీపీ)
8	4622	4275	347(టీడీపీ)
9	5475	4598	877(టీడీపీ)
10	4582	4130	452(టీడీపీ)
11	4912	4869	43(టీడీపీ)
12	5137	4821	316(టీడీపీ)
13	5214	4535	679(టీడీపీ)
14	4776	5792	1016(వైసీపీ)
15	4688	5096	408(వైసీపీ)
16	5279	4605	674(టీడీపీ)
17	4794	3415	1379(టీడీపీ)
18	5315	4346	969(టీడీపీ)
19	1647	1638	9(టీడీపీ)
	97,365	83,948	13,417(టీడీపీ)

పోస్టల్ బ్యాలెట్: మొత్తం ఓట్లు: 3032
ఎలిజిబుల్ ఓట్లు: 2777
టీడీపీ ఓట్లు : 1640
వైసీపీ ఓట్లు : 1078
మెజార్టీ : 562 (టీడీపీ)
మొత్తం మెజార్టీ(టీడీపీ): ఈవీఎం: 13417
పోస్టల్: 562
13979

మార్కాపురంలో ఫలించని వైసీపీ కులరాజకీయం

● టీడీపీకి అండగా ఆర్యవైశ్య ఓటర్లు

● మార్కాపురం, పొదిలి పట్టణాలలో 10,501 మెజార్టీ

మార్కాపురం, జూన్ 5: సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సునామీ సృష్టించింది. మార్కాపురంలో టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి విజయానికి టీడీపీ అధిష్ఠానం అమలు చేసిన పక్కా ప్రణాళికలు దోహదం చేశాయి. దీనికి తోడు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పార్టీ పోల్‌మేనేజ్మెంట్‌ను సక్రమంగా చేయడంలో, ద్వితీయ శ్రేణి నాయకులను ఎన్నికల యుద్ధానికి సన్నద్ధం చేయడంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సోదరుడు కందుల రామిరెడ్డి క్రియాశీలక పాత్ర పోషించాడు. ఎన్నికల సందర్భంగా మార్కాపురం నియోజకవర్గంలో చేసిన కులరాజకీయాలను ఎప్పటికప్పుడు ఎదుర్కొంటూ ఒక వైపు టీడీపీ ఓట్లకు నష్టం కలుగకుండా, మరోవైపు వైసీపీ ఓట్లను టీడీపీ వైపునకు తిప్పుకుంటూ ముందుకు సాగారు. దీంతో మార్కాపురం నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి స్వల్ప మెజార్టీతో విజయం సాధిస్తాడని చేసిన రాజకీయ నాయకుల అంచనాలను అధిగమించాడు. 13,979 ఓట్లతో విజయం సాధించాడు.

ఫలితంలేని వైసీపీ కులరాజకీయాలు

వైసీపీ అధిష్ఠానం మార్కాపురంలో తమ అభ్యర్థిగా అన్నా వెంకట రాంబాబును ఎంపిక చేయడంలో కులమే ప్రధాన భూమిక పోషించింది. మూడు పర్యాయాలు గిద్దలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేసి రెండుసార్లు గెలుపొందాడు. 2019 ఎన్నికలలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మెజారిటీ తర్వాత అత్యధికంగా 82 వేల ఓట్లుతో గెలుపొందాడు. కానీ 2024లో వైసీపీ అధిష్ఠానం నూతనంగా చేపట్టిన ఎమ్మెల్యేల బదిలీల నేపథ్యంలో మార్కాపురం నుంచి పోటీ చేశాడు. అన్నా రాంబాబు బదిలీకి కారణం ఆయన సామాజికవర్గానికి చెందిన ఓటర్లు అధిక సంఖ్యలో ఉండటమే కారణంగా ప్రచారం జరిగింది. అందుకు అనుగుణంగా వైసీపీ అభ్యర్థి అన్నా రాంబాబు కుల సమ్మేళనాలు, ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాలకు భారీ సంఖ్యలో ఆయన సామాజిక వర్గం వారు హాజరయ్యాయి. గెలుపుకోసం కృషి చేయాలని వారిని వేడుకున్నాడు. కానీ ఆర్య వైశ్య సామాజిక వర్గానికి చెందిన వారు వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పెరిగిన ఇబ్బందులను గుర్తు చేసుకున్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో వారికున్న సౌలభ్యాలను గుర్తుచేసుకున్నారు. మూకుమ్మడిగా రాష్ట్ర సామాజిక వర్గ ప్రయోజనాలవైపు మొగ్గుచూపారు. దాని ఫలితమే ఆర్యవైశ్య సామాజికవర్గ ఓటర్లు అధికంగా ఉన్న మార్కాపురం పట్టణంలో 8,179, పొదిలి పట్టణంలో 2,322 ఓట్ల మెజారిటీ తెలుగుదేశం పార్టీకి వచ్చింది. అంటే ఆర్య వైశ్య సామాజిక వర్గ ఓటర్లు తెలుగుదేశానికి అండగా ఉన్నారని తేటతెల్లమైంది.

వైసీపీ కంచుకోట బద్దలు

ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు గ్రామంలో టీడీపీకి 297 ఓట్ల మెజారిటీ

మార్కాపురం రూరల్, జూన్ 5: మార్కాపురం మండలంలో వైసీపీ కంచుకోటలుగా ఇప్పటి వరకు ఉన్న వేములకోట, బోడపాడు గ్రామాలను ఈ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ బద్దలు కొట్టింది. అసెంబ్లీ ఎన్నికలలో మండలంలోని వైసీపీ ఆధిక్యం ఉన్న గ్రామాలలో ఎన్నికలలో టీడీపీ పాగా వేసింది. 2024 అసెంబ్లీ ఎన్నికలకు నెల ముందు వేములకోట గ్రామంలో ప్రస్తుత ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సుమారు వంద వైసీపీ కుటుంబాలు, ఆ గ్రామ మాజీ సర్పంచ్ చాగంటి సుబ్బారెడ్డి అనుచరగణంతో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి తనయుడు రాఘవరెడ్డి కూడా హాజరై పెద్దఎత్తున నిర్వహించారు. టీడీపీ మాజీ సర్పంచ్, తన అనుచరులతో చేరడంతో టీడీపీకి బలం చేకూరింది. ఆ గ్రామంలో చేరికల ప్రభావం జూన్ 4న వెలువడిన ఫలితాలలో బహిర్గతమైంది. వేములకోటలో టీడీపీకి 296 ఓట్ల మెజారిటీని గ్రామ ఓటర్లు ఇచ్చారు. ఆ గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి స్వగ్రామం. ఆ గ్రామంలో సుమారు 30 సంవత్సరాల నుంచి జంకె కుటుంబం మద్దతు ఇచ్చిన వారికే గ్రామ ఓటర్లు మెజారిటీ ఇస్తూ వస్తున్నారు. ఈసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో గతం కంటే భిన్నంగా ఎమ్మెల్యే కందుల ఆధ్వర్యంలో టీడీపీకి తమ అభిమానాన్ని ఓటు రూపంలో చూపారు.

బోడపాడు గ్రామంలో టీడీపీకి మెజారిటీ

మండలంలో వైసీపీకి కంచుకోట గ్రామంగా పేరుఉన్నది బోడపాడు గ్రామం. ఈసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో టీడీపీకి మెజారిటీ వచ్చింది. సుమారు 30 ఏళ్ల నుంచి ఆ గ్రామ ఓటర్లు టీడీపీకి మెజారిటీని చూపించలేదు. ఆ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మండలంలో కీలక పదవులలో ఉన్నారు. ఒకరు ఎంపీపీగా, మరొకరు మండల కన్వీనర్‌గా ఇటీవల వరకు పదవులలో కొనసాగారు. ఆ గ్రామ టీడీపీ నాయకుడు కృషితో గ్రామ ఓటర్లను టీడీపీ వైపు మళ్లించుకోగలిగాడు. 2014 అసెంబ్లీ ఎన్నికలలో బోడపాడు గ్రామంలో 330 ఓట్లు, 2019 ఎన్నికల్లో 2,004 ఓట్లు వైసీపీకి మెజారిటీ వచ్చాయి. ఈసారి 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో టీడీపీకి 67 ఓట్ల మెజారిటీని గ్రామ ఓటర్లు ఇచ్చారు.

కందులను ఆదరించిన పొదిలి

పొదిలి, జూన్ 5 : పొదిలి మండల ప్రజలు పది సంవత్సరాల తరువాత టీడీపీని ఆదరించారు. కాటూరినారాయణస్వామి హయాం నుంచి మండలంలో ఉన్న టీడీపీ పట్టు 2024 ఎన్నికల్లో నిరూపించుకుంది. శాసనసభ ఎన్నికల ఫలితాల్లో పొదిలి మండల నాయకులు సమయస్ఫూర్తితో పనిచేసి సత్తాచాటారు. మండలంలో 66 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అందులో గ్రామీణంలో 36 పోలింగ్ కేంద్రాల్లో కేవలం 259 ఓట్లు మాత్రమే వైసీపీకి మెజారిటీ వచ్చింది. మిగిలిన పట్టణంలోని 30 పోలింగ్ కేంద్రాల్లో టీడీపీకి 2,322ఓట్లు మెజారిటీ సాధించింది. 20 పంచాయతీలలో వైసీపీ కేవలం 259ఓట్లు మెజారిటీ సాధించింది. పట్టణ ఓటర్లు టీడీపీకి ఆధిక్యతను కట్టబెట్టారు. పట్టణంలో కీలక వైసీపీ నేతల వార్డుల్లో మెజారిటీని నిలబెట్టుకున్నారు.

అదేవిధంగా 66పోలింగ్ కేంద్రాల్లో కొన్నింటిలో మెజారిటీ వారీగా 192లో 120, 195లో 42, 201లో 65, 203లో 8, 206లో 46, 207లో 125, 210లో 54, 212లో 108, 213లో 44, 215లో 97, 216లో 236, 218లో 228, 219లో 111, 220లో 111, 221లో 67, 224లో 35, 226లో 80, 228లో 18, 229లో 179, 232లో 70, 233లో 103, 234లో 163, 235లో 126, 236లో 360, 237లో 131, 238లో 250, 239లో 360, 240లో 315, 241లో 199, 242లో 141, 244లో 15, 246లో 28, 247లో 4, 250లో 139, 252లో 118, ఓట్ల మెజారిటీని టీడీపీ కైవసం చేసుకుంది. గత శాసన సభ ఎన్నికల్లో వైసీపీకి తిరుగులేని ఆధిక్యం సాధించిన మండల కేంద్రమైన పొదిలిలో సైతం టీడీపీ ఆధిక్యతను సాధించడంతో పార్టీ శ్రేణులు ఉత్సాహంతో ఉన్నారు.

ప్రజాతీర్పును గౌరవిస్తాం

మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

మార్కాపురం, జూన్ 5: మార్కాపురం నియోజకవర్గంలో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తా. ఓటమికి గల కారణాలపై సమీక్ష చేసుకొని ప్రజలకు చేరువయ్యేందుకు కృషి చేస్తా. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నా వంతు కృషి చేస్తా.

ప్రజలకు రుణపడి ఉంటా

- ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో మార్కాపురం నియోజకవర్గంలోని ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చేయడానికి కృషి చేస్తా. నేను ఎమ్మెల్యేగా గెలవడానికి కారణమైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నా.

మండల ప్రజలకు నారాయణరెడ్డి కృతజ్ఞతలు

పొదిలి, జూన్ 5 : ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించిన మండల ప్రజలకు కందుల నారాయణరెడి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం మండల ప్రజలను కలిసేందుకు పొదిలి వచ్చిన కందులను అభిమానులు, కార్యకర్తలు పూలదండలతో ముంచెత్తారు. మండలంలో అన్ని గ్రామాలనుంచి వచ్చిన కార్యకర్తలను ఆప్యాయంగా పలుకరించారు. గెలుపుకు కృషి చేసిన ఓటర్లకు, కార్యకర్తలకు, నాయకులకు ఎప్పుడు రుణపడి ఉంటానన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా తమ అభిమాన నాయకుడు అత్యధిక మెజారిటీతో గెలవడం, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్న సందర్భంగా పట్టణంలోని టీడీపీ అభిమానులు కార్యకర్తలు నిర్మమహేశ్వరస్వామి దేవాలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కాలేషా, గురిజాల నవీన్, కాటూరి శ్రీను, రబ్బానీ, జమీర్, రవి తదితర టీడీపీ కార్యకర్తలు ఉన్నారు. అదే విధంగా బ్యాంక్ కాలనీలో పొదిలి ఏఎంసీ మాజీ ఛైర్మన్ చప్పిడి రామలింగయ్య, నాయకులు కోకా చిన్నికృష్ణ , టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు వరికుంట్ల అనిల్ ఆధ్వర్యంలో భారీ కేక్‌లు కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు.

పోరాడి ఓడిన టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జూన్ 5 : ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఎరిక్షన్‌బాబు ఎలాగైనా విజయం సాధించాలని, నియోజకవర్గంలో టీడీపీ జెండాను రెపరెప లాడించాలనే పట్టుదలతో కసిగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పనిచేశారు. నియోజకవర్గంలో ఈపర్యాయం గెలుపు ఖాయమనే భావనను ఓటర్లలోకి తీసుకువెళ్ళారు. అన్ని మండలాల్లో పార్టీలోకి కొత్త ఓటర్లను చేర్పించారు. కానీ టీడీపీ విజయానికి స్వల్ప మెజారిటీతో దూరం అయ్యారు. ఎన్నికల్లో 2019లో వైసీపీకి వచ్చిన మెజారిటీతో పోల్చుకుంటే ఈపర్యాయం జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఆధిపత్యాన్ని భారీగానే తగ్గించారు.

దెబ్బతీసిన నాలుగు మండలాలు

ఎర్రగొండపాలెం నియోజకవర్గం లో టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబుపై వైసీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ 5,200 ఓట్లు మెజారిటీతో విజయం సాధించారు. నియోజకవర్గంలో ఐదు మండలాలకు గాను ఒక్క ఎర్రగొండపాలెం మినహా మిగతా పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు మండలాల్లో ఓట్ల శాతం భారీగా తగ్గింది. ఎర్రగొండపాలెం మండలంలో టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబుకు 20,878 ఓట్లు పోలు కాగా, వైసీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్‌కు 20,014 ఓట్లు వచ్చాయి. ఇక్కడ టీడీపీ అభ్యర్థికి 864 ఓట్లు మెజారిటీ వచ్చింది. పుల్లలచెరువు మండలంలో టీడీపీకి 17,646 ఓట్లు రాగా, వైసీపీకి 19,057 ఓట్లు వచ్చాయి. 1,411 ఓట్ల మెజారిటీ వైసీపీకి దక్కింది. త్రిపురాంతకం మండలంలో టీడీపీకి 19,702 ఓట్లురాగా, వైసీపీకి 21,182 ఓట్లు వచ్చాయి. అక్కడ వైసీపీకి 1,480 ఓట్ల ఆధిక్యత వచ్చింది. దోర్నాల మండలంలో టీడీపీకి 13,581ఓట్లు రాగా, వైసీపీకి 14,227 ఓట్లు వచ్చాయి. వైసీపీకి 646 ఓట్లు ఆధిక్యత వచ్చింది. పెద్దారవీడు మండలంలో టీడీపీకి 13,400 ఓట్లు రాగా, వైసీపీకి 16,142ఓట్లు వచ్చాయి. ఇక్కడ వైసీపీకి 2,742 ఓట్లు ఆధిక్యత వచ్చింది. ఎర్రగొండపాలెం మండలం మినహా మిగతా చోట్ల వైసీపీకి మెజారిటీ ఓట్లు వచ్చాయి. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థికి పోస్టల్ ఓట్లతో కలిపి 86,541 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థికి పోస్టల్ ఓట్లతో కలిపి 91,741 ఓట్లు సాధించారు. టీడీపీ కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబుపై 5,200 ఓట్ల ఆధిక్యంతో వైసీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ విజయం సాధించారు.

ఎర్రగొండపాలెం మండలంలో వర్షం

● చల్లబడిన వాతావరణం

ఎర్రగొండపాలెం, జూన్ 5 : ఎర్రగొండపాలెం మండలంలో బుధవారం మధ్యాహ్నం అరగంట సమయం వర్షం కురిసింది. ఈ వర్షంతో వాతావరణం చల్లబడింది. నీటి తడులు లేని బొప్పాయి, జామ, దానిమ్మ, అరటి తోటలకు ఈ వర్షం జీవం పోసింది. సోమవారం రాత్రి కొద్ది పాటి వర్షం కురిసింది. ఈ మధ్య 15 రోజుల వ్యవధిలో 3 పర్యాయాలు వర్షం కురవడంతో రైతులు భూముల సాగుకు దుక్కులను సిద్ధం చేస్తున్నారు.

ముత్తుముల గెలుపుతో మొక్కుతీర్చుకున్న కార్యకర్త

కొమరోలు, జూన్ 5: గిద్దలూరు ఎమ్మెల్యేగా ముత్తుముల అశోక్‌రెడ్డి విజయం సాధించాలని కొమరోలు గ్రామానికి చెందిన టీడీపీ కార్యాకర్త పెనుగొండ వెంకటరమణ 101 కొబ్బరికాయలు కొడతానని శ్రీ ఆంజనేస్వామి దేవాలయంలో మొక్కుకున్నారు. ప్రస్తుతం గిద్దలూరు ఎమ్మెల్యేగా ముత్తుముల అశోక్‌రెడ్డి ఘన విజయం సాధించినందుకు బుధవారం కొమరోలు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేస్వామి దేవాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన పెనుగొండు వెంకటరమణ కొబ్బరి కాయలు కొట్టి తన మొక్కు తీర్చుకున్నారు.

నీటి ఫలితాల్లో ప్రతిభ


వాసుదేవ్ గౌడ్

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 5: మార్కాపురంకు చెందిన అనగాని వాసుదేవ్ గౌడ్ నీట్ పరీక్షా ఫలితాలలో ప్రతిభ కనబర్చాడు. ఆల్ ఇండియా ర్యాంక్ 14,850 సాధించాడు. అదే విధంగా ఓబీసీ కోటాలో 6,251 ర్యాంక్ సాధించాడు. ఎన్‌టీఏ విడుదల చేసిన నీట్ పరీక్షా ఫలితాలలో ర్యాంకు సాధించి ఎంబీబీఎస్‌లో సీట్ సాధించాడు. ర్యాంకు సాధించిన వాసుదేవ్‌ను పలువురు అభినందించారు.

15 రౌండ్లలో టీడీపీ హవా

7రౌండ్లలో వైసీపీ స్వల్ప అధిక్యత

కనిగిరి నగర పంచాయతీ,

పామూరులో అధిక్యతతో సాగిన టీడీపీ

కనిగిరి, జూన్ 4 : కనిగిరి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి 15 రౌండ్లలో అధిక్యత చూపగా, 7 రౌండ్లలో మాత్రమే వైసీపీకి స్వల్ప మెజార్టీ వచ్చింది. నియోజకవర్గంలోని కనిగిరి నగరపంచాయతీతోపాటు పామూరు మండలంలో సైకిల్ హవా కొనసాగింది.

రౌండ్లవారీగా ఓట్లు వివరాలు :

రౌండ్	టీడీపీ	వైసీపీ	అధిక్యత	పార్టీ
1	4593	4668	75	(వైసీపీ)
2	4551	5138	587	(వైసీపీ)
3	5593	5412	181	(టీడీపి)
4	4605	4714	109	(వైసీపీ)
5	5266	4806	460	(టీడీపీ)
6	5157	4035	1112	(టీడీపీ)
7	4411	4107	304	(టీడీపీ)
8	4083	4266	183	(వైసీపీ)
9	6201	4595	1606	(టీడీపీ)
10	6377	3246	3131	(టీడీపీ)
11	6475	5047	1428	(టీడీపీ)
12	4984	5116	132	(వైసీపీ)
13	3525	4574	1049	(వైసీపీ)
14	4794	3702	1092	(టీడీపీ)
15	4580	3603	977	(టీడీపీ)
16	4626	4260	366	(టీడీపీ)
17	4869	4044	825	(టీడీపీ)
18	4093	3707	386	(టీడీపీ)
19	4338	3724	614	(టీడీపీ)
20	5646	4166	1480	(టీడీపీ)
21	5362	3064	2298	(టీడీపీ)
22	952	1126	174	(వైసీపీ)

కాగా, వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణ 91,140ఓట్లు, పోస్టల్ 923 రాగా 92,063 ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డికి 1,05,060 ఓట్లు రాగా, పోస్టల్ ఓట్లలో టీడీపీకి 1,742 వచ్చాయి. దీంతో ఉగ్ర నరసింహారెడ్డికి 1,06,802 ఓట్లు రావటంతో 15,662 ఓట్లతో మెజార్టీ సాధించి తమ సమీప వైసీపీ అభ్యర్థిపై గెలుపొందారు.

దద్దాలకు సొంత మండలంలో షాక్

వెలిగండ్ల, జూన్ 4 : వైసీపీ అభ్యర్థి దద్దాల నారయణ యాదవ్ సొంత మండలంలో టీడీపీ ఆధిక్యం చాటుకుంది. వెలిగండ్ల మండలంలో పెరుగుపల్లి నారాయణ స్వగ్రామం, ఆయన భార్య మంజుభార్గవి హుస్సేన్‌పురం సర్పంచ్‌గా ఉన్నారు వారి సొంత మండలంలో టీడీపీ 346 ఓట్ల మెజార్టీ సాధించింది. 2019లో ఇదే మండలంలో వైసీపీ 5,650 మెజారిటీ సాధించింది. మెగళ్లూరు 216 ఓట్లు, వెలిగండ్ల 203, గన్నవరం 79, మోటుపల్లి 116, వెదళ్లచెరువు 68, జిల్లెలపాడు 79, కంకణంపాడు 84, మళ్లంరాజుపల్లి 63, చోడవరం 60, గుడిపాటిపల్లి, 112, రాళ్లపల్లి 34, కొత్తనర్సాంబాపురం 157 ఓట్ల మెజారిటీ టీడీపీకి వచ్చింది. దీంతో మండలంలో కార్యకర్తలు టీడీపీ అభిమానులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

ఉగ్రకు శుభాకాంక్షలు తెలిపిన కోటపాటి

పామూరు, జూన్ 4 : కనిగిరి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఉగ్రనరసింహారెడ్డిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇరిగినేని రవీంద్రబాబు, గుర్రం వెంకటేశ్వర్లు, కోటపాటి నరసింహారావు, పువ్వాడి వెంకటేశ్వర్లు, ఏలూరి వెంకటేశ్వర్లు ఉన్నారు.

దోబూచులాడిన దర్శి

అత్యధిక రౌండ్లలో టీడీపీకి ఆధిక్యం

అయినా అందని విజయం

దర్శి, జూన్ 5 : దర్శి నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపులో అధికశాతం రౌండ్లలో టీడీపీకి ఆధిక్యత లభించినప్పటికీ విజయం దక్కలేదు. కొన్ని రౌండ్లలో వైసీపీకి భారీ మెజార్టీ లభించటంతో ఆ పార్టీ విజయాన్ని సొంతం చేసుకుంది. మొత్తం 21 రౌండ్లు ఓట్ల లెక్కింపు జరగ్గా 11 రౌండ్లల్లో టీడీపీకి మెజార్టీ లభించింది. వైసీపీకి 10 రౌండ్లల్లో ఆధిక్యత వచ్చింది. వైసీపీకి 1వ రౌండ్‌లో 916 ఓట్లు, 7వ రౌండ్‌లో 1211, 10వ రౌండ్‌లో 1071, 13వ రౌండ్‌లో 509, 14వ రౌండ్‌లో 315, 16వ రౌండ్‌లో 542, 18వ రౌండ్‌లో 1996, 19వ రౌండ్‌లో 804, 20వ రౌండ్‌లో 449, 21వ రౌండ్‌లో 234 ఓట్లు వైసీపీకి మెజార్టీ లభించింది. అదేవిధంగా టీడీపీకి 2వ రౌండ్‌లో 482 ఓట్లు, 3వ రౌండ్‌లో 165, 4వ రౌండ్‌లో 344, 5వ రౌండ్‌లో 230, 6వ రౌండ్‌లో 558, 8వ రౌండ్‌లో 1212, 9వ రౌండ్‌లో 317, 10వ రౌండ్‌లో 943, 11వ రౌండ్‌లో 504, 14వ రౌండ్‌లో 225, 16వ రౌండ్‌లో 601 ఓట్లు ఆధిక్యత లభించింది. పోస్టల్ బ్యాలెట్స్‌లో టీడీపీ అభ్యర్థికి 141 ఓట్ల ఆధిక్యత లభించింది.



ప్రభావితం చేసిన నోటా ఓట్లు

నోటాకు పడిన ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థికి పడిన ఓట్లు ఎన్నికల ఫలితంపై ప్రభావితం చూపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. వైసీపీ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కేవలం 2456 ఓట్ల మెజార్టీతో గెలుపొందిన విషయం తెలిసిందే. దర్శి నియోజకవర్గంలో నోటాకు 2107 ఓట్లు పడ్డాయి. అదేవిధంగా కాంగ్రెస్ అభ్యర్థి కొండారెడ్డికి 1985 ఓట్లు లభించాయి. నోటాకు పడిన ఓట్లు వైసీపీకి లభించిన ఆధిక్యత కంటే కేవలం 449 ఓట్లు మాత్రమే తక్కువగా ఉన్నాయి. కాంగ్రెస్ అభ్యర్థికి కూడా రమారమి 2వేల ఓట్లు లభించటంతో ఆ ఓట్లు ఫలితంపై ప్రభావితం చూపి ఉంటాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్లలో టీడీపీకి స్వల్ప ఆధిక్యం

దర్శి జూన్ 5 : మొన్నటి సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలోని ఉద్యోగులంతా ఒకవైపు ఉండగా దర్శి నియోజకవర్గంలో ఉద్యోగులు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. పోస్టల్ బ్యాలెట్స్‌లో టీడీపీ అభ్యర్థికి దక్కిన ఓట్లను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. అన్ని ప్రాంతాల్లో 75శాతానికి పైగా పోస్టల్ బ్యాలెట్లు టీడీపీ కూటమికి దక్కగా ఇక్కడ కేవలం 55శాతం ఓట్లు మాత్రమే దక్కాయి. నియోజకవర్గంలో మొత్తం 2,175 పోస్టల్ బ్యాలెట్లు ఉండగా అందులో టీడీపీ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీకి 1,103 ఓట్లు వచ్చాయి. వైసీపీ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి 962 ఓట్లు లభించాయి. అనూహ్యంగా 85 ఓట్లు చెల్లలేదు. అనేక మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును కూడా వినియోగించుకోలేదు. పోస్టల్ బ్యాలెట్‌లో టీడీపీకి కేవలం 141 ఓట్ల ఆధిక్యత మాత్రమే లభించింది. రాష్ట్రవ్యాప్తంగా అధిక సంఖ్యలో ఉద్యోగులు టీడీపీ కూటమికి మద్దతు పలకటంతో అనేక నియోజకవర్గాల్లో 500 నుంచి 1000 ఓట్లకు పైగా మెజార్టీ దక్కింది. నియోజకవర్గంలో కేవలం 141 ఓట్ల ఆధిక్యత రావటం పట్ల రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులను ఎంతో ఇబ్బందులు పెట్టినప్పటికీ సుమారు 48శాతం మంది ఆ పార్టీకే ఓటు వేయటం గమనార్హం. డబ్బుల ప్రభావం కూడా అధికంగా కనిపించింది.

ఫ్యాన్ రెక్కలు విరగ్గొట్టి.. రోడ్డుపైకి లాగి...!

పీసీపల్లి, జూన్ 5 : ఐదేళ్లుగా రాక్షస పాలన సాగించిన వైసీపీ ప్రభుత్వంపై టీడీపీ శ్రేణుల్లో గూడుకట్టుకున్న ఆవేదనను మంగళవారం రాత్రి ఆ పార్టీ కార్యకర్తలు ఫ్యాన్‌రెక్కలు విరిచేసి తాడు కట్టి రోడ్డుపైకి లాగి తమ నిరసన తెలిపారు.

డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మంగళవారం రాత్రి పీసీపల్లి మండలంలోని వెంగళాపురం వద్ద ఉన్న గంగమ్మను దర్శించుకున్నారు.

ముంచిన ముండ్లమూరు, దర్శి మండలాలు

టీడీపీ ఓటమికి ఆ ప్రాంతాలే ప్రధాన కారణం

దర్శి, జూన్ 5 : దర్శి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఓటమికి ఆ రెండు మండలాలే ప్రధాన కారణం. అక్కడ ఆశించిన మేరకు మెజార్టీ రాకపోగా టీడీపీకి భారీగా గండిపడింది. ప్రధానంగా ముండ్లమూరు మండలంలో 3వేలకు పైగా టీడీపీకి మెజార్టీ వస్తుందని ఆ పార్టీ నాయకులు ఘంటాపథంగా చెబుతూ వచ్చారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఓట్ల బలబలాలు చూస్తే ముండ్లమూరు మండలంలో టీడీపీకి కేవలం 96 ఓట్ల ఆధిక్యత మాత్రమే లభించింది. దర్శి రూరల్ మండలంలో కూడా ఊహించని దెబ్బతగిలింది. రూరల్ మండలంలో 1000 నుంచి 1500 వరకు టీడీపీకి మెజార్టీ వస్తుందని భావించినప్పటికీ ఊహించని విధంగా 293 ఓట్లు వైసీపీకి ఆధిక్యత లభించింది. ఈ రెండు మండలాల్లో టీడీపీకి గండి పడటంతో కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మీ అనూహ్యంగా ఓటమి చవిచూశారు. కురిచేడు మండలంలో కూడా ఆశించిన మేరకు మెజార్టీ లభించలేదు. ఆ మండల టీడీపీ నాయకులు 2వేల మెజార్టీ వస్తుందని ధీమాగా చెప్పినప్పటికీ కేవలం 1114 ఓట్లు మెజార్టీ లభించింది.

దొనకొండ, తాళ్లూరు మండలాల్లో పక్కాగా టీడీపీ నేతల లెక్కలు

దొనకొండ, తాళ్లూరు మండలాల్లో పోలింగ్ టీడీపీ నాయకులు ఆశించిన విధంగానే జరిగింది. దొనకొండ మండలంలో వైసీపీకి కేవలం 719 ఓట్లు మాత్రమే ఆధిక్యత లభించింది. ఈ మండలంలో సుమారు 3వేల మెజార్టీ వస్తుందని వైసీపీ నాయకులు లెక్కలు కట్టారు. అయినప్పటికీ టీడీపీ అంచనాలే నిజమయ్యాయి. తాళ్లూరు మండలంలో కూడా విశ్లేషకుల అంచనాలకు తగినట్లుగానే వైసీపీకి 3,514 ఓట్లు ఆధిక్యత లభించింది. వైసీపీ నాయకులు వాస్తవంగా ఈ మండలంలో ఐదు వేల వరకు మెజార్టీ వస్తుందని ధీమాగా ఉన్నారు. ఓటర్ల నాడీ కనిపెట్టడంలో ఎ అంచనాలు తప్పినప్పటికీ ముండ్లమూరు మండలంలో టీడీపీ అంచనాలు తల్లకిందులు కావటంతో ఫలితం తిరగబడిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తంమీద 2,456 ఓట్ల మెజార్టీతో వైసీపీ విజయం సాధించింది. టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మీ విజయం కోసం పోరాటం చేసింది. కేవలం 40రోజుల సమయంలో నియోజకవర్గం అంతా పర్యటించటంతో పాటు ఓటర్లను విశేషంగా ఆకట్టుకుంది. అయితే ఆమెను వరించకపోవటంతో స్వల్ప తేడాతో ఓటమి చెందారు.

ఉగ్రకు జైకొట్టిన పీసీపల్లి

పీసీపల్లి, జూన్ 4 : పీసీపల్లి మండలం టీడీపీ అభ్యర్థి ఉగ్రనరసింహారెడ్డికి జైకొట్టింది. 16 పోలింగ్ కేంద్రాల పరిధిలో వైసీపీకి ఆధిక్యత రాగా, 23 పోలింగ్‌కేంద్రాల్లో టీడీపీ ఆధిక్యత సాధించింది. మొత్తం మీద టీడీపీకి 2,700 పైగా ఓట్ల మెజారిటీ వచ్చింది. మండలంలో అత్యధికంగా పెదఅలవలపాడు పంచాయతీలో టీడీపీకి 1061 ఓట్ల మెజారిటీ రావడం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కూటమి ఘనవిజయం సాధించడంతో మండలంలోని టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు.టీడీపీతో జత కలిసిన బీజేపీ, జనసేన కార్యకర్తలు రంగులు చల్లుకుని మిఠాయిలు పంచుకుని హర్షం వ్యక్తంచేశారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

పట్టణంలోని 18 కేంద్రాలలో టీడీపీ కూటమి అభ్యర్థి ఉగ్రకు ఆధిక్యత లభించింది. గత ఎన్నికల్లో వైసీపీకి 2వేలు మెజార్టీ రాగా, ఈ ఎన్నికల్లో ఆ మెజార్టీని అధిగమించి 2,285 ఓట్ల ఆధిక్యత టీడీపీకి లభించింది. పామూరులో కేంద్రాల వారీగా పరిశీలిస్తే 264 బూత్‌లో 158 ఓట్లు, 265లో 164 ఓట్లు, 266లో 123ఓట్లు, 267లో 22 ఓట్లు, 268లో 140ఓట్లు, 269లో 29ఓట్లు, 270లో 67ఓట్లు, 271లో 5ఓట్లు, 272లో 152ఓట్లు, 273లో 72ఓట్లు, 274లో 139ఓట్లు, 275లో 43ఓట్లు, 276లో 208ఓట్లు, 277లో 45ఓట్లు, 278లో 164ఓట్లు, 279లో 153ఓట్లు, 280లో 241ఓట్లు 281లో 360 ఓట్ల ఆధిక్యం లభించింది.

తాళ్లూరు మండలంలో సంబరాలు

తాళ్లూరు జూన్ 4 : సాధారణ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించటంపై మండలంలోని పలుగ్రామాల్లో మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. పోలీసుల ఆంక్షలున్నా పలుగ్రామాల్లో శ్రేణులు సీఎం చంద్రబాబు, మోడీ, పవన్‌కల్యాణ్ జిందాబాద్ అంటూ నినాదాలిచ్చారు. నాగంబొట్లపాలెంలో తెలుగు మహిళలు గులాం చల్లుకుంటూ ఉర్రూతలూగారు.

ఉగ్ర గెలుపుపై తెలుగుమహిళలు హర్షం

పామూరు, జూన్ 4 : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి గెలవడంతో మండల తెలుగు మహిళలు హర్షాతిరేకం వక్తం చేశారు. వారిలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బొల్లా మహాలక్ష్మమ్మ, బీ మున్ని, ఎం రమాదేవి, ఆవుల రమణమ్మ, షేక్ రహీమున్ని, జగదాబి రమణమ్మ, నూర్‌బి తదితరులు ఉన్నారు.

పామూరులో టీడీపీ ఆధిక్యం

పామూరు, జూన్ 4 : సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో పామూరు

అంబరాన్నంటిన శ్రేణుల సంబరాలు

కనిగిరి, జూన్ 4 : నియోజకవర్గ ప్రజలు ఎన్డీయే కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి బ్రహ్మరథం పట్టారు. ఈ ఎన్నికల్లో ఉగ్రకు 1,05,060 ఓట్లు రాగా, 1742 పోస్టల్ ఓట్లు వేశారు. వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణకు 91,140 ఓట్లు రాగా, 923 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేశారు. దీంతో 14,739 ఓట్లు మెజార్టీతో డాక్టర్ ఉగ్ర విజయం సాధించారు. దీంతో కనిగిరి పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. అమరావతి గ్రౌండ్, వైఎస్సార్‌రోడ్డులోని ఎన్టీఆర్ అభి

పాల వాహనం ఢీకొని పశువుల కాపరి మృతి

ముండ్లమూరు, జూన్ 5 : మండలంలోని చినఉల్లగల్లు ఎస్సీ కాలనీకి చెందిన గడ్డం లింగోజీ(52) అనే పశువుల కాపరిని బుధవారం 2 గంటల సమయంలో పాల వ్యాన్ ఢీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. లింగోజీ పశువులు మేపుకొనేందుకు పసుపుగల్లు, ఉల్లగల్లు మధ్య రామనగర్ వాగు సమీపంలో పశువులు మేపుకుంటూ వర్షం పడుతుండటంతో నేల చప్టా దిమ్మె మీద కూర్చొని ఉండటంతో మండలంలోని చంద్రగిరి సమీపంలోని శ్రీరామ్ డెయిరీకి చెందిన పాల ఆటో వచ్చి లింగోజీని ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే సమాచారం బంధువులకు తెలియటంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు, బంధువులు వచ్చి మృత దేహంపై పడి భోరున విలపించారు. లింగోజీకి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. ముండ్లమూరు పోలీసులు సమాచారం అందించటంతో సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అట్లపల్లి రిజర్వాయర్‌లో పసికందు మృతదేహం

కురిచేడు, జూన్ 5 : మండలవాసులకు మంచినీటిని అందించే అట్లపల్లి రిజర్వాయర్‌లో పసి కందు మృతదేహం బయటపడింది. రెండు రోజుల క్రితం సాయంత్రం పూట ముగ్గురు మహిళలు చెరువు కట్టమీద గోలగోలగా ఉండడాన్ని స్థానికులు గమనించారు. బుధవారం సాయంత్రం చెరువు పక్కనే పొలం పనులు చేసుకునే వారు కట్టమీద వెళుతుండగా పసికందు మృతదేహం కనిపించింది. ఎస్‌ఏపీ రక్షిత నీటి పథకం సిబ్బంది వెంటనే ఆ మృతదేహాన్ని బయటకు తీసి చెరువును శుభ్రం చేశారు.

నీట్ ఫలితాల్లో సత్తాచాటిన సునేహారెడ్డి

దొనకొండ, జూన్ 5 : నీట్ ఫలితాల్లో దొనకొండ మండలం, పోలేపల్లి పంచాయతీ కందులవారిపల్లికి చెందిన కందుల సునేహారెడ్డి ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంక్ సాధించి సత్తాచాటింది. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం మేలో నిర్వహించిన నీట్ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో సునేహారెడ్డి 720 మార్కులకు 656 మార్కులతో ర్యాంక్ సాధించారు.

ముండ్లమూరు మండలంలో భారీ వర్షం

ముండ్లమూరు, జూన్ 5 : మండలంలో బుధవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో పాటు అరగంట పాటు భారీ వర్షం కురిసింది. పసుపుగల్లు, చింతలపూడి, పెద ఉల్లగల్లు, కెల్లంపల్లి, వేముల, కమ్మవారిపాలెం, రాగోపాలరెడ్డినగర్, పులిపాడులో భారీ వర్షం కురవగా ముండ్లమూరు, సింగనపాలెంతో పాటు శంకరాపురం, పోలవరం గ్రామాల్లో ఒక దాదాపు అరగంట పాటు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది.

పసుపుగల్లులో పిడుగుపాటుతో భార్య, భర్తలకు తప్పిన ప్రమాదం

పసుపుగల్లులో ఆచారి తన భార్యతో కలసి గ్రామానికి ఉత్తరం వైపు ఉన్న పొలాల్లో మేత కోసం వెళ్ళగా వర్షం పడుతుండటంతో సమీపంలోని వేప చెట్టు కిందకు వెళ్లారు. ఆ సమయంలో ఒక్కసారిగా చెట్టుపై పిడుగు పడటంతో స్పృహ తప్పి పడిపోయారు. కొంచం సేపటికి ఆ దారిన వెళ్తున్న వారు చూసి వారిని ఇంటికి తీసుకొచ్చారు. మొత్తం మీద వైద్యసహాయంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.



అధినేతతో.. తాజా ఎమ్మెల్యేలు

టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడ్ని బుధవారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో తాజాగా ఎన్నికైన ఎమ్మెల్యేలు మర్యాద పూర్వకంగా కలిశారు. నక్కా ఆనందబాబు, అనగాని సత్యప్రసాద్ జూలకంటి బ్రహ్మారెడ్డి, భాష్యం ప్రవీణ్ కలిశారు. లోకేశ్ ను ప్రత్తిపాటి పుల్లారావు, నరేంద్ర, నజీర్ అహ్మద్, భాష్యం ప్రవీణ్ కలిశారు.















విజేతలను ఊహించి విజేతలయ్యారు..

- ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో కూపన్ల డ్రా
- 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' విజేతలకు బహుమతులు
- తొలి విజేతకు రూ.10 వేలు, మరో ముగ్గురికి రూ.5 వేలు



లక్కీడిప్ డ్రాలో పాల్గొన్న ఆంధ్రజ్యోతి గుంటూరు డీజీఎం రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి సాంబశివరావు, సర్క్యులేషన్ మేనేజర్ భాస్కరరెడ్డి, యాడ్ మేనేజర్ సుబ్బారావు తదితరులు

గుంటూరు, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల గెలుపు, ఓటములపై విశ్లేషిస్తూ 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి జిల్లా స్థాయిలో నిర్వహించిన లక్కీడీప్ కూపన్ల డ్రా బుధవారం వెంగళాయపాలెంలోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో జరిగింది. నెలరోజుల నుంచి ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన కూపన్లలో ఎన్నికల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఎవరు గెలిచేది తెలియజేస్తూ ఊహించి పూర్తి చేసిన వారిలో అదృష్టవంతులను ఎంపిక చేశారు. గుంటూరు డీజీఎం సూదా రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి సూర్యదేవర సాంబశివరావు, సర్క్యులేషన్ మేనేజర్ భాస్కరరెడ్డి, యాడ్స్ మేనేజర్ సుబ్బారావుల ఆధ్వర్యంలో కూపన్ల డ్రా కార్యక్రమం జరిగింది. ఇందులో మొదటి బహుమతిగా రూ.10 వేలను రేపల్లెకు చెందిన బోయిన ఉయ్యారు గెలుచుకున్నారు. ద్వితీయ బహుమతిగా రూ.5 వేలను ఇచ్చేందుకు ముగ్గురిని ఎంపిక చేయగా వారిలో నరసరావుపేటకు చెందిన షేక్ మాబు సుభా ని, వినుకొండకు చెందిన మాదాల హైమారావు, పెద కాకాని మండలం ఉప్పలపాడుకు చెందిన మంచికల పూడి మదన మోహనరావు ఉన్నారు. విజేతలకు డీజీఎం రామచంద్రరావు ఫోన్ ద్వారా సమాచారం తెలియజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అవినీతిపై తిరుగుబాటు



- పూడాలో అక్రమ వసూళ్లపై రియల్ వ్యాపారుల ధర్నా
- అవినీతి అనకొండలా మారారని వైఎస్ చైర్మన్‌పై ఆగ్రహం
- బెదిరించి వసూలు చేసిన రూ.7 కోట్లు కక్కాలని మండిపాటు
- ప్రభుత్వం మారడంతో కార్యాలయం వద్ద బాధితుల ఆందోళన
- తమ డబ్బు తిరిగి ఇవ్వాల్సిందేనని బాధిత వ్యాపారుల డిమాండ్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పూడా మాది.. మా ప్రభుత్వం అధికారంలో ఉంది.. మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం.. మమ్మల్ని అడిగే వారెవరు.. అని వైఎస్ చైర్మన్ చెలరేగిపోయాడు. ప్రభుత్వ అండతో పెద్దఎత్తున అక్రమార్జనకు పాల్పడ్డాడు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. పూడా బాధితులు తిరుగుబాటుతో వైఎస్ చైర్మన్ కంగుతిన్నాడు. ఇంతకాలం నోరుమెదపకుండా వారు అడిగినట్లు.. చెప్పినట్లు చేసిన రియల్ వ్యాపారులు తమ నుంచి వసూలు చేసిన మొత్తాలను కక్కాలంటూ నరసరావుపేటలోని పూడా కార్యాలయం వద్ద బుధవారం ఆందోళనకు దిగారు. తమ డబ్బు తిరిగి చెల్లించాలని వైస్ చైర్మన్ గజ్జల శ్రీనివాసరెడ్డిని నిలదీశారు. నరసరావుపేట కేంద్రంగా పల్నాడు అర్బన్ డవలప్‌మెంట్ అధార్టీ(పూడా)ని గతంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికి వైస్ చైర్మన్‌గా గతంలో జడ్పీ సీఈవోగా పనిచేసిన గజ్జల శ్రీనివాసరెడ్డిని నియమించింది. అయితే ఆయన నిబంధనలు, ప్లాన్ల మాటున అక్రమ వసూళ్లకు తెరలేపారని బాధితులు ఆరోపించారు. జిల్లాలో అనధికార లేవుట్లను 258 వరకు గుర్తించి నోటీసులు జారీ చేశారు. వెంచర్ల క్రమబద్ధీకరణకు సంబంధం లేకుండా ఒక్కొక్క వెంచర్ నుంచి రూ.2 లక్షలు డిమాండ్ చేయగా రూ.1.50 లక్షలకు అంగీకరించగా ఆ మేరకు డబ్బు చెల్లించామన్నారు. ఈ ప్రకారం తమ నుంచి రూ.3.72 కోట్లు వసూలు చేశారన్నారు. అలాగే బహుళ అంతస్తులు, షాపింగ్ కాంప్లెక్స్‌ల ప్లాన్ల మంజూరులో కూడా చేతివాటం ప్రదర్శించినట్లు బాధితులు తెలిపారు. డీవియేషన్ ఉన్న భవనాలు, బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లను గుర్తించి రూ.4 లక్షల నుంచి రూ.4.5 లక్షల చొప్పున వసూలు చేసినట్లు బాధితులు తెలిపారు. ఇలా రూ.3 కోట్లకు పైగా వసూలు చేశారని బాధితులు చెబుతున్నారు.



పూడా వైస్‌చైర్మన్ గజ్జల శ్రీనివాసరెడ్డితో మాట్లాడుతున్న సీఐ

వైసీపీనే వస్తుందని బరితెగింపు..

మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తుందన్న ధీమాతోనే ఆయన బరి తెగించినట్లు ప్రచా రం జరుగుతోంది. ఈ క్రమంలో రియల్ వ్యాపారులతో పాటు పలువురు కాంట్రాక్టర్లు కూడా పూడా కార్యాలయానికి వచ్చి తమను తీవ్రంగా నష్టపరిచారంటూ ఆ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు పూర్తి చేసినా జీరో ఖాతా కింద చూపించారని వాపోయారు. ఆయన కారణంగా తాము అప్పులు పాలై ఆస్తులను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల ఆందోళనతో కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రూ.50 లక్షలు చెల్లింపు

వసూలు చేసిన అవినీతి సొమ్ములో రూ.50 లక్షలు కక్కించారు. కార్యాలయం వద్ద ఆందోళనతో కంగుతిన్న అవినీతి తిమింగలం దిగిరాక తప్పలేదు. అక్రమంగా వసూలు చేసిన సొమ్ములో శ్రీనివాసరెడ్డి కొంత తిరిగి ఇచ్చారని బాధితులు తెలిపారు. 3 గంటల వ్యవధిలోనే రూ.50 లక్షలు చెల్లించడం గమనార్హం. తమ ఆందోళనతో చేసిన తప్పును ఆయన అంగీకరించినట్లు బాధితులు తెలిపారు. ఒక్క రొంపిచర్ల మండలంలోనే ఈ అధికారి చేసిన ఆర్థిక అరాచకం వల్ల రూ.15 కోట్ల బిల్లులు రాలేదని బాధితులు చెప్పారు. ఓ కాంట్రాక్టర్‌కు రూ.3 కోట్ల బిల్లులు ఇవ్వకుండా పనులు జరగలేదని తప్పుడు సర్టిఫికేట్ ఇచ్చారన్నారు. దాచిన ఎం బూక్‌లను కాంట్రాక్టర్ల వారీగా తిరిగి ఆ శాఖ అధికారులకు అప్పగించేందుకు పోలీసుల సమక్షంలో ఒప్పందం జరిగిందన్నారు. రెండు రోజుల్లో ఎం బుక్‌లు తిరిగి ఇవ్వకపోతే మళ్లీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని తెలిపారు.

ఆధిక్యాలు.. అదుర్స్

- పూర్తిస్థాయిలో కూటమి ఓట్ల బదిలీ
- ప్రతీ నియోజకవర్గంలో రికార్డు స్థాయి మెజారిటీ
- నామమాత్రంగానూ ప్రభావం చూపలేకపోయిన వైసీపీ

ప్రతీ రౌండ్‌లోనూ టీడీపీనే పైచేయి ● కౌంటింగ్ ఆసాంతం ఏకపక్షమే



బాపట్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అభ్యర్థులు దూసుకెళ్లారు. ప్రతీ నియోజకవర్గంలోనూ మెజార్టీల్లో రికార్డులే రికార్డులు.. ప్రతీ రౌండ్‌లోనూ ఆధిక్యమే.. ఏ స్థాయిలోనూ ప్రభావం చూపలేకపోయిన వైసీపీ.. ఇదీ తాజా ఎన్నికల ఫలితాల్లో బాపట్ల జిల్లాలో వైసీపీ పరిస్థితి. గతంలో ఎన్నడూ చూడని మెజారిటీలు వచ్చాయి. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని వర్గాలు టీడీపీకి జై కొట్టడంతో జిల్లాలోని ఆరు అసెంబ్లీ స్థానాలతో పాటు లోక్‌సభ స్థానంతో టీడీపీ క్లీన్‌స్వీప్ చేసింది. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన 2019లో జరిగిన ఎన్నికల్లో వేమూరు, బాపట్ల స్థానంతో పాటు బాపట్ల లోక్‌సభ స్థానాన్ని వైసీపీ గెలుచుకుంది. ఇప్పుడు ఆరుకు ఆరు స్థానాలతో పాటు బాపట్ల లోక్‌సభను కూడా వైసీపీ కోల్పోయింది. వైసీపీకి కంచుకోటగా చెప్పుకునే గ్రామాలు సైతం టీడీపీ బాట పట్టడంతో ఏ ఒక్క నియోజకవర్గంలో కూడా కనీస పోటీని వైసీపీ ఇవ్వలేకపోయింది. వేమూరులో తొలి 5 రౌండ్లలో నామమాత్రంగా ప్రభావం చూపిన వైసీపీ తర్వాత టీడీపీ జోరు ధాటికి కుదేలైంది. బాపట్లలో మొత్తం 16 రౌండ్లకు 3, 8 రౌండ్లలో మాత్రమే వైసీపీ స్వల్ప ఆధిక్యం కనబరచింది. పైగా 2019 ఫలితాలతో పోలిస్తే ఎక్కువ మెజారిటీలను నమోదు చేసింది.

మూడో అత్యధికం

బాపట్ల టీడీపీ ఎమ్మెల్యేగా విజయం సాధించిన వేగేశన నరేంద్రవర్మ సాధించిన మెజారిటీ 27,768. నియోజకవర్గ చరిత్రలో ఇది మూడో అత్యధికం. వరుసగా నాలుగు పర్యాయాలుగా ఇక్కడ టీడీపీ విజయం సాధించిందే లేదు. వైసీపీ కంచుకోటగా ఉన్న బాపట్ల నుంచి వర్మ ఏకాఎకిన 27,768 ఓట్ల మెజారిటీని నమోదు చేశారు. 2019లో చీరాలలో టీడీపీ అభ్యర్థి కరణం బలరాం కృష్ణమూర్తి 17,419 ఓట్ల మెజారిటీతో గెలుపొందగా, ప్రస్తుతం ఇదే పార్టీ తరపున ఎంఎం.కొండయ్య 20,558 ఓట్లతో గెలుపొందడం విశేషం. అద్దంకిలో 2019లో టీడీపీ 12,991 ఓట్లతో మెజారిటీతో విజయం సాధించగా, ప్రస్తుతం ఆ మెజారిటీ 24,890కి చేరింది. పర్చూరులో గతంలో 1,647 కాగా, ప్రస్తుతం 24,138 ఓట్ల మెజార్టీ టీడీపీ సాధించింది. రేపల్లెలోనూ గతంతో పోలిస్తే మెజార్టీ భారీగా పెరిగి 40,018కి చేరుకుంది. ఈ నాలుగు స్థానాలూ 2019లో కూడా టీడీపీ గెలిచినవే. కాకుంటే అప్పటితో పోలిస్తే మెజారిటీలలో భారీగా పెరుగుదల నమోదైంది. ఇక 2019లో వైసీపీ ఖాతాలో ఉన్న బాపట్ల 15,199 ఓట్లతో విజయం సాధించింది. ఇప్పుడు అదే సీటును 27,768 ఓట్ల భారీ మెజార్టీతో టీడీపీ తన ఖాతాలో వేసుకుంది. వేమూరులో మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు 9,999 ఓట్ల తేడాతో వైసీపీ అభ్యర్థి చేతిలో పరాజయం పాలయ్యారు. ప్రస్తుతం అదే స్థానంలో ఆయన 21,973 ఓట్ల భారీ ఆధిక్యంతో వైసీపీ అభ్యర్థిని ఓడించారు.

చీరాలలో క్రాస్ ఓటింగ్


బాపట్ల లోక్‌సభ టీడీపీ ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌కి సంబంధించి అత్యధికంగా క్రాస్ ఓటింగ్ చీరాల నియోజకవర్గంలో జరిగింది. ఇక్కడ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం. కొండయ్యకి 71,360 ఓట్లు పోలవ్వగా ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌కు 92,781 ఓట్లు పోలయ్యాయి. 21,421 ఓట్లు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా ఎంపీ అభ్యర్థికి ఎక్కువగా పడ్డాయి. ఇక్కడ త్రిముఖ పోటీ జరగడమే ఇందుకు కారణంగా కనబడుతోంది. అసెంబ్లీకి వచ్చేసరికి టీడీపీకి 71,360, వైసీపీకి 50,802, కాంగ్రెస్‌కు 41,295 ఓట్లు పోలయ్యాయి. అదే పార్లమెంట్ అభ్యర్థికి వచ్చేసరికి చీరాల అసెంబ్లీ పరిధిలో టీడీపీకి 92,781, వైసీపీకి 49,641, కాంగ్రెస్‌కు 19,407 ఓట్లు పడ్డాయి. కాంగ్రెస్‌కు సంబంధించి అసెంబ్లీకి, పార్లమెంట్‌కు మధ్య 21,888 ఓట్లు తేడా ఉంది. ఈ తేడా ఓట్లన్నీ పార్లమెంట్‌కు వచ్చేసరికి టీడీపీ ఎంపీ అభ్యర్థికి పోలవ్వడం వల్ల అసెంబ్లీ కన్నా పార్లమెంట్‌కు 21,421ఓట్లు అధికంగా నమోదయ్యాయి. ఆమంచికి ఓటు వేసిన ఓటర్లు, ఎంపీకి వచ్చేసరికి ఆ ఓటును టీడీపీకి వేయడం వల్లే మెజారిటీ పెరిగింది. ఇక వేమూరులో ఎంపీతో పోల్చుకుంటే ఎమ్మెల్యేకి 6,722 ఎక్కువగా ఓట్లు పడ్డాయి. రేపల్లెలో ఎంపీకి 1,07,485 ఓట్లు పడితే, 1,11,129 ఓట్లు పోలయ్యాయి. పర్చూరులో ఎంపీకి 1,08,579 ఓట్లు పడితే, ఎమ్మెల్యేకి 1,08,491 ఓట్లు పడ్డాయి. అద్దంకికి వచ్చేసరికి ఎంపీకి 1,14,583 ఓట్లు పడితే ఎమ్మెల్యేకి 1,16,418 ఓట్లు నమోదయ్యాయి. సంతనూతలపాడులో ఎంపీకి 1,03,815ఓట్లు పోలయితే, ఎమ్మెల్యేకి 1,05,757 ఓట్లు పోలయ్యాయి.

● కూటమి పార్టీల ఓట్ల బదిలీ సాఫీగా..

టీడీపీ తీసుకున్న పొత్తు నిర్ణయాలపై తొలుత కొంత అనుమానాలు వ్యక్తమైనా ఆ తర్వాత అన్నీ సర్దుకుని నేతలు కలిసి కట్టుగా నడిచారు. దీంతో టీడీపీ అభ్యర్థులకు భారీ మెజార్టీలు సాధ్యమయ్యాయి. ఈ క్రమంలో వైసీపీ పన్నిన దుష్ట పన్నాగాలను సైతం కూటమి నేతలతో పాటు ఓటర్లు కూడా సమర్థంగా తిప్పికొట్టారు. ఓట్ల బదిలీ సాఫీగా జరిగింది. ఈ దఫా ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులు కూడా పెద్ద సంఖ్యలో టీడీపీకి జై కొట్టాడారు. వేమూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థికి పోస్టల్ బ్యాలెట్‌లలో 457 ఓట్ల మెజార్టీ నమోదైతే, బాపట్లలో 968, రేపల్లెలో 1717, పర్చూరులో 643, అద్దంకిలో 458 ఓట్ల ఆధిక్యాన్ని పోస్టల్ బ్యాలెట్‌లో టీడీపీ కట్టబెట్టారు.

వైసీపీ తాబేదారుల్లో.. వణుకు

- నాడు అంటకాగారు.. నేడు ఆందోళన
- విచక్షణ మరచిన అధికారులకు కాళరాత్రులే



గుంటూరు సిటీ, జూన్ 5: ఎంత ఉద్యోగులైనా ప్రభుత్వంతో అంటకాగ డమనేది ఆక్షేపణీయం. వైసీపీ ప్రభుత్వంలో కొందరు ఉద్యోగులు అంతకంటే ఎక్కువగా రెచ్చిపోయారు. విచక్షణ మరచి కొందరు అధికారులు వైసీపీ నాయకులకంటే ఎక్కువగా ప్రవర్తించారు. ఇందులో అన్ని శాఖల అధికారులు ఉన్నా పోలీసులు చాలా ముందున్నారు. కొందరు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పరుగులు పెట్టి మరీ వైసీపీకి ఊడిగం చేశారు. ఎన్నికల ఫలితాలు వైసీపీ తాబేదారుల జవసత్వాలను కుంగదీశాయి. వైసీపీ ముద్ర పడిన అధికారుల గుండెల్లో బండరాయి పడింది. ఎవరినో నమ్ముకుని ఏదో చేస్తే ఏదో అయ్యింది అన్న సామెత ఉమ్మడి గుంటూరు జిల్లాలో రుజువు అవుతోంది. యువనేత లోకేశ్ రెడ్ బుక్ ఫీవర్ కొందరు అధికారులకు నిద్ర పట్టకుండా చేస్తోంది.

అమ్మో.. ఎంత ఘోరం

అమరావతి ఉద్యమ సమయంలో ఓ డీఎస్పీ నిరసన శిబిరం వద్దకు వెళ్లి మహిళలను జుగుప్సాకరంగా మాట్లాడారు. రైతులపై లాఠీని ఝళిపించారు. ఇప్పుడు ఆ అధికారి ఆత్మరక్షణలో పడ్డారు.

* పల్నాడులో ఎన్నికల కౌంటింగ్ ముగిసిన తర్వాత వైసీపీ నేతలు దాడులతో టీడీపీ కార్యకర్తలు పోలీసులను ఆశ్రయించగా సత్తెనపల్లి సబ్ డివిజన్ అధికారి వారిపై భూతులతో రెచ్చిపోయారు. ఊర్లు వదిలి వెళ్లాలని హుకుం జారీ చేశారు.

* మాచర్ల, గురజాల, సత్తెనపల్లి నియోజక వర్గాల పరిధిలోని పలువురు పోలీసు అధికా రులు టీడీపీ నేతలు, కార్యకర్తల పై తప్పుడు కేసులు నమోదు చేసి రోజుల తరబడి స్టేషన్లో నిర్బంధించారు.

* స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో విజయవాడ నుంచి మాచర్ల వచ్చిన టీడీపీ నేతలను హత మార్చేందుకు వైసీపీ రౌడీలు ప్రయత్నించారు. దీనిపై అప్పటి సీఐని ప్రశ్నిస్తే అసలు ఇక్కడకు ఎవరు రమ్మన్నా రంటూ టీడీపీ నేతలపై ఎదురు కేసుకు సిద్ధమయ్యారు.

* సీఐడీ విచారణ పేరుతో అమరావతిలోని టీడీపీ కార్యకర్త ఇంట్లోకి అర్థరాత్రి ప్రవేశించి న పోలీసులు అమానవీయంగా ప్రవర్తించారు.

* మంగళగిరిలో లోకేశ్ గెలుస్తాడని జడ్పీ దగ్గర మీడియాతో చెప్పిన పెదకాకాని మండ లానికి చెందిన వెంకాయమ్మ అనే దళిత మహిళపై వైసీపీ మూకలు దాడి చేసి ఆమె కుమారుడ్ని కొట్టాయి.

* పిడుగురాళ్లకు చెందిన టీడీపీ కార్యకర్త రామకృష్ణ సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టా డని పోలీసులు తీసుకువెళ్లి ఇబ్బందులు పెట్టారు.

* పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే శంకర రావుపై ఎన్‌జీటీలో ఫిర్యాదు చేశాడని అమరా వతికి చెందిన టీడీపీ కార్యకర్తను పోలీసులు చిత్రహింసలకు గురిచేశారు.

* రఘురామకృష్ణంరాజును అరెస్టు చేసి గుంటూరుకి తీసుకువచ్చినప్పుడు కొందరు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. మెడికల్ రిపోర్ట్ విషయంలో వైద్యులను పోలీసులు బెదిరించారన్న ఆరోపణలు ఉన్నాయి.

* ప్రభుత్వం వచ్చిన మొదట్లో ఉమ్మడి జిల్లా అధికారిగా పనిచేసిన వ్యక్తి పూర్తిగా వైసీపీ చొక్కా వేసుకుని పనులు చేశారు. వైసీపీ నేతలు ఎవరిని ఇబ్బంది పెట్టమంటే వాళ్లని ఇబ్బందులు పెట్టారు. ఉద్యోగులను సస్పెన్షన్ చేసే సందర్భంలోని బందనలు పాటించలేదు.

* ఉమ్మడి జిల్లాలోని ఇద్దరు ముఖ్య అధికారులు టీడీపీ నేతలే లక్ష్యంగా తప్పుడు రిపోర్టులు ప్రభుత్వానికి పంపి వారిపై సీబీఐ కేసులకి కారణమయ్యారు.

* ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని టీడీపీ ఫిర్యాదు చేసినా కొందరు జిల్లా స్థాయిలో బుట్టదాఖలు చేశారు. ఈ అధికారులు చివరకు కొందరు మీడియా ప్రతినిధులను ఛాంబర్‌లోనికి కూడా రానివ్వలేదు.

* గ్రామ వార్డు, సచివాలయ ఉద్యోగుల ఎంపిక సమయంలో స్థానిక వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు చెప్పిన జాబితాను దగ్గర పెట్టు కుని టీడీపీ సానుభూతి పరులకు ఉద్యోగాలు రాకుండా చేశారు. చివరి కాంట్రాక్టు, ఔట్ సో ర్సింగ్ ఉద్యోగాల్లో కూడా అర్హులకు అన్యాయం చేశారు.

* ఓ చిరుద్యోగి టీడీపీకి అనుకూలంగా ఉన్నా రని తండ్రి శవం వద్ద ఉన్న సమ యంలో గుంటూరు వైద్యఆరోగ్య శాఖ కార్యాల యం నుంచి ఫోన్ చేసి త్వరగా వచ్చి సస్పె న్షన్ ఆర్డర్ తీసుకు వెళ్లాలని ఒత్తిడి చేసి పిలి పించి ఉత్తర్వులు చేతిలో పెట్టారు.

* మెప్మాలో ఓ ఉన్నత స్థాయి అధికారిణి ద్వారా సంఘాలు లక్ష్యంగా రాజకీయం చేశారు. జిల్లా స్థాయిలో అధికారులను ఏర్పా టు చేసుకుని వైసీపీకి అనుకూలంగా ఉన్న వారిని అందలాలు ఎక్కించారు.

అరెస్టా.. పరారా?

- పీఆర్కేకు ముగిసిన బెయిల్ గడువు
- సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో పిన్నెల్లికి గడ్డుకాలమే

నరసరావుపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అధికారం అండ.. పోలీసుల సహకారంతో చెలరేగిపోయిన మాచర్ల వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గడ్డుపరిస్థితులను ఎదుర్కొం టున్నాడు. అధికారం అండతో రెచ్చిపోయిన పిన్నెల్లి ఎన్నికల హింస నేపథ్యంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. హత్యాయత్నం, పాల్వాయిగేటు పోలింగ్ బూత్‌లో ఈవీఎం ధ్వంసం తదితర కేసులు ఆయనను వెంటాడుతున్నాయి. ఈ కేసుల్లో హైకోర్టు ఇచ్చిన ముం దస్తు బెయిల్ గురువారంతో ముగియనున్నది. ఈ నేపథ్యంలో గురువారం ఆయన కోర్టుకు హాజరు కావాల్సి ఉంది. హైకోర్టు ఆదేశాలతో నరసరావుపేటలో ఉన్న ఆయన ఎస్పీ కార్యా లయంలో రోజూ సంతకం చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం హైకోర్టు ఇచ్చే తీర్పుపై ఆయన అరెస్టు ఆధారపడి ఉంది. ఆయనను పోలీసులు ఈ సారైనా అరెస్టు చేస్తారా.. మళ్లీ తప్పించుకుని పోయేలా సహకరిస్తారా అంశం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. బెయిల్ గడువు పూర్తయిన వెంటనే పోలీసులు ఆయన్ను అరెస్టు చేసే విషయంలో ఏ విధంగా స్పందిస్తారో చూడాలి. పాల్వాయిగేట్ టీడీపీ ఏజెంట్ నంబూరు శంకరరావు పిటీషన్ నేపథ్యంలో పిన్నెల్లి ముందస్తు బెయిల్‌పై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు నేపథ్యంలో తిరిగి ఆయనకు కోర్టులో ఊరట లభించకపోవచ్చని న్యాయవాదులు చెబుతున్నారు. ఈ క్రమంలో పిన్నెల్లి కదలికలపై పోలీసులు నిఘా ఉంచారు.

వెంకట్రామిరెడ్డిని మరిచిన పోలీసులు

ఎన్నికల హింస కేసుల్లో ప్రధాన నిందితుడు, షాడో ఎమ్మెల్యేగా అరాచకాలు జరిపించిన పిన్నె ల్లి సోదరుడు వెంకట్రామిరెడ్డి కూడా తప్పించుకు తిరుగుతున్నాడు. స్టేషన్‌లో నమోదైన హత్యాయత్నం కేసులో ఆయన అరెస్టుకు పోలీ సులు కనీస ప్రయత్నాలు కూడా చేయడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

మనస్తాపంతో వివాహిత బలవన్మరణం

చీరాలటౌన్, జూన్ 5 : జె.పంగులూరుకు చెందిన వివాహిత (35) చిన గంజాం సమీపంలో రైలు కిందపడి బలవన్మరణం చెందింది. ఈమెకు గతంలో ముప్పాళ్లకు చెందిన భర్తతో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. ప్రస్తుతం ఇద్దరు సంతానం. కుటుంబ కలహాల నేపథ్యంలో గతకొంత కాలంగా పుట్టింటి లోనే ఉంటుంది. ఈక్రమంలోనే బుధవారం మధ్యాహ్నం రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు ఏరియా వైద్యశాలకు తరలించారు.

రెండు ద్విచక్రవాహనాల ఢీ.. వ్యక్తికి తీవ్రగాయాలు

మార్టూరు, జూన్ 5 : మార్టూరు పోలీస్ స్టేషన్ ఎదురుగా జొన్నతాళి రోడ్డు వైపు వెళ్లే సర్వీసు రోడ్‌లో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. బుధవారం జరిగిన ప్రమాదంలో పల్సర్ బైక్‌పై వెళుతున్న కే నాగదుర్గాప్రవీణ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. అతనిని 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అందిన సమాచారం మేరకు.. పర్చూరు మండలం చిననందిపాడుకు చెందిన నాగదుర్గాప్రవీణ్ బైకుపై మార్టూరు సెంటర్ వైపు నుంచి జొన్నతాళి సెంటరు వైపు వెళుతుండగా ఎదురుగా స్కూటీపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు ఢీకొన్నారు. దుర్గాప్రవీణ్‌కు గాయాలుకాగా స్కూటీని నడుపుతున్న వ్యక్తికి గాయాలైనట్లు తెలిసింది. అతను మార్టూరు గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలిసింది. దీనిపై పోలీసులకు సమాచారం లేదు.

బెట్టింగ్‌లతో నిండా మునిగిన వైసీపీ శ్రేణులు

అద్దంకి, జూన్ 5 : ఎన్నికలలో వైసీపీ ఓడిపోయిందన్న బాధ కంటే బెట్టింగ్‌లలో పోగొట్టుకున్న సొమ్ములే వైసీపీ నేతలకు నిద్ర పట్టకుండా చేస్తోంది. వైసీపీ అధికారంలోకి వస్తుందని కొందరు, అద్దంకి నియోజకవర్గంలో వైసీపీ విజయం సాధిస్తుందని మరి కొందరు, ఇంకొందరు గొట్టిపాటికి 15వేలకు మించి మెజార్టీ రాదని బెట్టింగ్‌లు జరిగాయి. నియోజకవర్గంలో వైసీపీ గెలుస్తుందని రూ.లక్షకు మూడు నుంచి 7లక్షల వరకు బెట్టింగ్‌లు జరిగాయి. 15వేల మెజార్టీ మీదనే ఎక్కువ బెట్టింగ్‌లు సాగాయి. ఇవి అన్ని దాటి మెజార్టీ 24,890 ఓట్ల మెజార్టీ వచ్చింది. దీంతో వైసీపీ నేతలు బెట్టింగ్‌లలో సర్వస్వం కోల్పోయారు. కొద్దిమంది టీడీపీ నేతలు అత్యుత్సాహంతో కౌంటింగ్ రోజు కౌంటింగ్ సరళిని బట్టి అప్పటికప్పుడు 25వేల మెజార్టీపై బెట్టింగ్‌కు ఆ డబ్బు దిగడంతో వైసీపీ నేతలకు వచ్చాయి. ఇలా అద్దంకి నియోజకవర్గంలో అత్యధిక గ్రామాలలో వైసీపీ నేతలు వారిస్తాయని మించి బెట్టింగ్‌లు పెట్టారు. దీంతో తీవ్రంగా నష్టపోయారు. బడా నేతలు మాత్రం వాళ్ల సంపాదించింది బెట్టింగ్ లలో పోగొట్టుకున్నారు అన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇక మధ్య, చిన్న నాయకులు మాత్రం బెట్టింగ్‌ల పుణ్యాన అప్పుల పాలయినట్లు తెలుస్తుంది. చీరాల, దర్శిలలో గెలుపుపై బెట్టింగ్ పెట్టినట్లు తెలుస్తుంది. చీరాలలో కరణం వెంకటేష్ గెలుపుపై, దర్శిలో గొట్టిపాటి లక్ష్మి గెలుపుపై అద్దంకి నియోజకవర్గంలోని కొద్ది మంది టీడీపీ నేతలు బెట్టింగ్ పెట్టి నష్టపోయినట్లు తెలుస్తుంది. అద్దంకి నియోజకవర్గంలో పొందిన లాభంలో కొంత భాగం ఇతర నియోజకవర్గాల బెట్టింగ్‌లో పోగొట్టుకున్నా ఇంకా మిగులు లోనే ఉన్నట్లు తెలుస్తుంది. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఎన్నికలలో బెట్టింగ్‌లు పెద్ద మొత్తంలో జరగడంతో తీవ్రంగా నష్టపోవడం వైసీపీ నాయకుల వంతైంది. మధ్యవర్తులు మాత్రం కమీషన్‌లతో లబ్ధిపొందారు.

హింసాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జూన్ 5 : ఎన్నికల నేపథ్యంలో హింసాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించినట్లు ఈపూరుపాలెం ఎస్ఐ మర్రి శివకుమార్ పేర్కొన్నారు. స్టేషన్ పరిధిలోని గవినివారిపాలెం, రామాపురం ప్రాంతాల్లో పోలీస్ పికెట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ప్రత్యేక బలగాలకు సూచనలు చేశారు. అల్లరి మూకలు విధ్వంసాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

టీడీపీ కార్యాలయంలో సందడేసందడి



కొండయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యేలు గరటయ్య, గోవర్ధనరెడ్డి

చీరాల, జూన్ 5 : టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య ఎమ్మెల్యేగా గెలుపొందిన నేపథ్యంలో బుధవారం కూటమి శ్రేణులు పెద సంఖ్యలో టీడీపీ కార్యాలయానికి చేరుకొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపాయి. మాజీ ఎమ్మెల్యేలు బాచిన చెంచు గరటయ్య, చీరాల గోవర్ధనరెడ్డి, టీడీపీ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు, కూరపాటి పూర్ణచంద్రరావు తదితరులు ప్రత్యేకంగా కొండయ్యను అభినందించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన కూటమి శ్రేణులతో కార్యాలయం ప్రాంగణంగా సందడిగా మారింది. కొండయ్యకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపి ఫొటోలు దిగేందుకు నాయకులు, కార్యకర్తలు పోటీపడ్డారు.

విజయ సంబరం..!

జిల్లాలో తెలుగు తమ్ముళ్ల కేరింతలు

భారీ విజయాలతో ఉరకలేస్తున్న ఉత్సాహం

గెలుపొందిన అభ్యర్థులకు అభినందనల వెల్లువ

ఇళ్లు కార్యాలయాల వద్ద సందడి వాతావరణం

పోలీసు ఆంక్షలతో అట్టహాస కార్యక్రమాలు రద్దు

జిల్లాలో తెలుగు తమ్ముళ్లు సంబరాల్లో మునిగి తేలుతున్నారు. ఇటు జిల్లాలో భారీ విజయాలతో వారిలో ఉత్సాహం ఉరకలెత్తుతోంది. గెలుపొందిన అభ్యర్థుల ఇళ్లు, కార్యాలయాల వద్ద బుధవారం కోలాహలం కనిపించింది. గెలిచిన అభ్యర్థులను కలవడానికి జనం కిక్కిరిశారు. ఎక్కడ చూసినా పండగ వాతావరణం నెలకొంది. శాలువాలు, పుష్పగుచ్ఛాలు, పూలమాలలతో వచ్చి శుభాకాంక్షలతో ముంచెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, జనసేన శ్రేణులు తరలివచ్చి వారికి అభినందనలు చెప్తున్నారు. అభ్యర్థుల ఇళ్లు, కార్యాలయాల వద్ద ట్రాఫిక్ జాం అయిందంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు.

ఒంగోలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లగా రాష్ట్రంలో సాగిన వైసీపీ అవినీతి, అరాచక పాలనలో జిల్లాలోని టీడీపీ శ్రేణులు అనేక ఇబ్బందులు పడ్డాయి. అక్రమ కేసులు, దౌర్జన్యాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. అనేకమంది ఆర్థికంగా కూడా నష్టపోయారు. అన్ని వర్గాల ప్రజలపైనా వైసీపీ ప్రభుత్వం వేధింపులు ఉన్నా టీడీపీ వారు అధికంగా వాటిని ఎదుర్కోవాల్సి వచ్చి ఇబ్బందులు పడ్డారు. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీని దించేయాలన్న పట్టుదలతో అందరూ కసిగా పనిచేశారు. జనసేన, బీజేపీ శ్రేణుల మద్దతుతో పాటు వివిధ వర్గాల ప్రజల్లో ఏర్పడిన వైసీపీ ప్రభుత్వ వ్యతిరేకత తోడ్పడింది. ఫలితంగా అటు రాష్ట్రంలో, ఇటు జిల్లాలో టీడీపీ భారీ విజయాలు సాధించడం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. జిల్లాలో చూస్తే తీవ్ర ప్రతికూల వాతావరణం ఉండే ఒంగోలు పార్లమెంట్ స్థానంతో పాటు ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో ఆరుచోట్ల టీడీపీ విజయకేతనం ఎగురవేసింది. రెండుచోట్ల స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైనా అక్కడా పోరాడి ఓడామన్న భావన ఉంది. ఇక గెలుపొందిన స్థానాలలో తూర్పు ప్రాంతంలో వేలాది ఓట్ల మెజార్టీలు రావడం పార్టీశ్రేణులను ఉత్సాహ పరిచాయి.

శుభాకాంక్షలు తెలిపేందుకు పోటెత్తారు

గెలుపొందిన అభ్యర్థులను అభినందించేందుకు వేలాదిగా పార్టీశ్రేణులు బుధవారం వారి వద్దకు తరలిరావడం ద్వారా వారిలో ఉన్న ఉత్సాహం ప్రస్ఫుటమైంది. ఒంగోలులో భారీ మెజార్టీతో గెలుపొందిన దామచర్ల జనార్దన్‌ను అభినందించేందుకు, శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గంతోపాటు పొరుగు ప్రాంతాల నుంచి భారీగా శ్రేణులు తరలివచ్చారు ఇక్కడి గుంటూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయం అభిమానులు, నాయకులతో కిటకిటలాడింది. ఎంపీగా గెలుపొందిన మాగుంట శ్రీనివాసులరెడ్డి, కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డీఎస్‌బీవీ స్వామిలు విడివిడిగా ఉదయం అమరావతి వెళ్లి అధినేత చంద్రబాబును కలిసి మధ్యాహ్నానికి తిరిగి వచ్చారు. అనంతరం వారి నివాసాలకు పెద్దఎత్తున పార్టీశ్రేణులు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఒంగోలు మంగమూరురోడ్డులోని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ నివాసం పార్టీశ్రేణులు, అభిమానులతో రద్దీగా మారింది. నియోజకవర్గంలోని అనేక గ్రామాల వారు ఉదయం నుంచే భారీగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలుపగా రద్దీ అధికం కావడంతో సాయంత్రం చీమకుర్తి వెళ్లి అక్కడి పార్టీ కార్యాలయంలో పార్టీశ్రేణులను బీఎన్ కలిశారు.

కనిగిరిలో తిరునాళ్లను తలపించేలా..

కనిగిరిలో గెలుపొందిన డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి నివాసం, పార్టీ కార్యాలయమైన అమరావతి గ్రౌండ్స్ వద్ద తిరునాళ్ల వాతావరణం కనిపించింది. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి భారీగా శ్రేణులు తరలివచ్చారు. అలాంటి వాతావరణమే మార్కాపురంలో గెలుపొందిన కందుల నారాయణరెడ్డి, గిద్దలూరులో గెలుపొందిన అశోక్‌రెడ్డిల నివాసాల వద్ద కనిపించింది. పెద్దసంఖ్యలో పార్టీశ్రేణులు వచ్చి అభినందనలు తెలిపారు. వైపాలెం, దర్శిల్లో ఓటమి బాధించినా రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఆ ప్రాంత టీడీపీ శ్రేణులు కొంత ఊరట చెందుతున్నారు. ఇదిలాఉండగా జిల్లాలోని అనేక గ్రామాలు, పట్టణాలలో వివిధ పేటల్లో స్థానికంగా ఎక్కడికక్కడ పార్టీశ్రేణులు పెద్దఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. అ యితే భారీ ర్యాలీలు, సభల నిర్వహణకు శ్రేణులు సిద్ధమైనా పోలీసు ఆంక్షలతో వాటిని విరమించుకుంటున్నారు.



ఒంగోలులో నృత్యం చేస్తున్న టీడీపీ శ్రేణులు

మాగుంట కార్యాలయంలో కోలాహలం

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 5: ఒంగోలు లోక్‌సభ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గెలుపొందిన మాగుంట శ్రీనివాసులరెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. స్థానిక రామనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో బుధవారం ఉదయం, సాయంత్రం మాగుంట, ఆయన తనయుడు రాఘవరెడ్డిలను కలిసి అభినందనలు తెలిపారు. వివిధ వర్గాల ప్రజలు బొకేలు, శాలువలతో సత్కరించారు. మరోవైపు వివిధ ప్రాంతాల్లోని వేదపండితులు ఇరువురికి ఆశీర్వచనాలు అందజేశారు. నగరానికి చెందిన పలువురు ప్రముఖులు మాగుంటను కలిసి అభినందించారు. కాగా మాగుంట గెలుపునకు పనిచేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు మాగుంట రాఘవరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ అభ్యర్థులు దామచర్ల జనార్దన్, డోలా బాలవీరాంజనేయస్వామి, డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డిలకు అఖండ విజయం అందించిన ఒంగోలు పార్లమెంట్ ఓటర్లు, టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలకు మాగుంట శ్రీనివాసులరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీకి జైకొట్టిన ఉద్యోగులు

20,135 ఓట్లు చెల్లాయి

అందులో 60.72 శాతం కూటమికే

పోస్టల్ బ్యాలెట్లతో గెలుపొందిన అశోక్‌రెడ్డి

ఒంగోలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు తెలుగుదేశం పార్టీ వైపే అధికంగా నిలిచారు. గత ఎన్నికలలో వైసీపీకి అనుకూలంగా ఓట్లు వేసిన అనేకమంది ఈసారి టీడీపీకి మద్దతుగా నిలిచారు. పలుచోట్ల వైసీపీకి కన్నా టీడీపీ అభ్యర్థులకు దాదాపు రెట్టింపు స్థాయిలో వచ్చాయి. అయితే కొన్నిచోట్ల వైసీపీ అభ్యర్థులు భారీగా డబ్బు పంచి ఉద్యోగుల ఓట్లు కొన్నా ప్రభావం కూడా కనిపించింది. పోస్టల్ బ్యాలెట్ ఫలితాలు విశ్లేషిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. ఎన్నికల విధులలో కీలకమైన పోలింగ్ సిబ్బంది అలాగే రవాణా, విద్యుత్, పోలీస్ వంటి అత్యవసర సర్వీసులైన శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉంది. గతంలో ముందుగా ఎన్నికల అధికారికి దరఖాస్తు చేసుకొని బ్యాలెట్ పత్రాన్ని పొంది తమకు నచ్చిన వారికి ఓటు వేసి కవర్‌ను ఆర్వో కార్యాలయంలో ఇచ్చేవారు. ఆ సమయంలో పోటీలో ఉన్న అభ్యర్థులు పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కొనుగోలు చేసి వారి సమక్షంలో ఓటు వేయించుకునేవారు. తర్వాత సదరు కవరును ఆ ఉద్యోగి లేదా కొనుగోలు చేసిన పార్టీ తరఫు వారు తీసుకెళ్లి ఆర్వో కార్యాలయంలో ఏర్పాటుచేసిన బాక్సులో వేసేవారు. ఇది అధికార పార్టీకి అనుకూలంగా పనిచేసేది. ఈ సారి ఎన్నికల సంఘం నిబంధనలు మార్పు చేసింది. పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రత్యేకంగా మూడు రోజుల పాటు నియోజకవర్గ కేంద్రాలలో పోలింగ్ నిర్వహించింది. ఆ పరిధిలోని వారే కాక రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో ఓటు ఉండి ఇక్కడ పనిచేస్తూ ఎన్నికల విధులలో ఉన్నవారు అక్కడ పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో పాల్గొనేలా చేశారు. అలా ఇక్కడ జేసీగా ఉన్న గోపాలకృష్ణ తన సొంత ఊరు శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గ అభ్యర్థులకు ఓటు వేశారు. ఆ విషయం అలా ఉంచితే పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసే వారంతా ఉద్యోగులే కాక వారిలో అత్యధికులు ఈసారి టీడీపీ అభ్యర్థులకే వేశారు.

నియోజకవర్గం	చెల్లిన ఓట్లు	టీడీపీ	వైసీపీ
వైపాలెం	1,871	1,054	777
ఒంగోలు	4,974	2,892	1,980
కొండపి	2,157	1,364	740
సంతనూతలపాడు	2,202	1,431	720
దర్శి	2,090	1,003	962
కనిగిరి	2,705	1,742	923
మార్కాపురం	2,777	1,640	1,078
గిద్దలూరు	3,449	2,271	1,130
ఒంగోలు పార్లమెంట్	21,040	12,065	7,643

కనిపించిన డబ్బు ప్రభావం

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు పోలైన పోస్టల్ బ్యాలెట్‌లలో కొద్దిసంఖ్యలో వివిధ కారణాలతో కౌంటింగ్ సమయంలో తిరస్కరణకు గురికాగా 20,135 ఓట్లు చెల్లాయి. వాటిని లెక్కించగా సుమారు 60.72శాతంతో 13,497 మంది టీడీపీ అభ్యర్థులకు ఓట్లు వేయగా 37.34శాతంతో 8,310 మంది వైసీపీకి వేశారు గరిష్ఠంగా గిద్దలూరు, సంతనూతలపాడు, కనిగిరి నియోజకవర్గాల్లో 64 నుంచి 66 శాతం ఉద్యోగులు టీడీపీకే వేశారు. ఒంగోలుతో పాటు కొన్నిచోట్ల ఉద్యోగుల ఓట్లపై డబ్బు ప్రభావం కూడా కనిపించింది. వైసీపీ అభ్యర్థులు ఒంగోలు, దర్శి వంటి చోట్ల ఒక్కొక్క బ్యాలెట్‌ను రూ.5వేలు వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. ఆ ప్రభావంతో ఆ ప్రాంతంలో కొంత మేర ఉద్యోగుల ఓట్లు వైసీపీకి అనుకూలంగా పడినట్లు సమాచారం. మొత్తంగా అధికశాతం ఉద్యోగులు ఈసారి టీడీపీవైపే మొగ్గు చూపారు. కాగా గిద్దలూరులో టీడీపీ అభ్యర్థి గెలుపులో ఉద్యోగుల ఓట్లే కీలకమయ్యాయి. ఈవీఎంల్లోని ఓట్లలో వైసీపీ అధిక్యత ఉండగా పోస్టల్ బ్యాలెట్‌లో వచ్చిన అధిక్యతతో అక్కడ టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డి గెలుపొందారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

పెద్దారవీడు, జూన్ 5: రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులు దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటన పెద్దారవీడు మండలంలోని గొబ్బూరు వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ఎర్రగొండపాలెం మండలం చెన్నరాయునిపల్లెకు చెందిన మేకల బ్రహ్మం(18), పోరెడ్డి చిన్న వెలుగొండయ్య(18)లు బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై మార్కాపురం వచ్చారు. పనులు పూర్తయిన అనంతరం తిరిగి చెన్నరాయునిపల్లికు వెళుతుండగా అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై బొలెరో వాహనం ఢీ కొట్టింది. దీంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్సై వెంకట సైదులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మార్కాపురం సర్వజన వైద్యశాలకు వెళ్లి మృతదేహాలను పరిశీలించి నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటానని, ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఐదోసారి గొట్టిపాటి విజయదుందుభి

అద్దంకిని అడ్డాగా మార్చుకున్న రవికుమార్



ఎమ్మెల్యే గొట్టిపాటికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న కౌన్సిలర్ రజని



కనకదుర్గమ్మ ఆలయానికి పాదయాత్రగా కాశీవిశ్వనాథం, టీడీపీ మహిళా కార్యకర్తలు

అద్దంకి, జూన్ 5 : గత ఐదు సార్వత్రిక ఎన్నికలను పరిశీలిస్తే ప్రత్యర్థి ఎవరైనా, పార్టీ ఏదైనా విజ యం మాత్రం గొట్టిపాటి రవికుమార్‌దేగా మారింది. 2004లో రాజకీయ ప్రవేశం చేసిన గొట్టిపాటి రవికుమార్ ఇప్పటికి ఐదు సార్లు పోటీ చేసి ఐదుసార్లు విజయం సాధించారు. రెండు సార్లు కాంగ్రెస్ పార్టీ తరపున, ఒక సారి వైసీపీ తరపున, రెండుసార్లు టీడీపీ తరపున పోటీ చేసి విజయం సాధించారు. 2004లో మార్టూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున తొలిసారి పోటీ చేసి పెద్దనాన్న గొట్టిపాటి హనుమంతరావు కుమారుడు నర్సయ్యపై 13,806 ఓట్ల మెజార్టీతో తొలివిజయం సాధించారు. 2009 నాటికి మార్టూరు నియోజకవర్గం రద్దు కావడంతో కాంగ్రెస్ పార్టీ తరపున అద్దంకి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తిపై 15,764 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2014లో వైసీపీ తరపున గొట్టిపాటి పోటీచేసి టీడీపీ తరపున పోటీ చేసిన కరణం వెంక టేష్‌పై 4,235 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2015లో వైసీపీకి రాజీనామా చేసి అప్పటి అధికారపార్టీగా ఉన్న టీడీపీలో చేరారు. 2019లో టీడీపీ తరపున పోటీ చేసిన గొట్టిపా టి రవికుమార్ వైసీపీ తరపున పోటీ చేసిన బాచిన చెంచుగరటయ్యపై 12,9 91 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినప్ప టి నుంచి గొట్టిపాటి రవికుమార్ ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టినా బెదరకుండా నిలబడ్డారు. 2024లో టీడీపీ తరపున రెండవ సారి పోటీ చేసి వైసీపీ అభ్యర్థి పాణెం హనిమిరెడ్డిపై భారీ మెజార్టీ తో విజయాన్ని కైవసం చేసుకున్నారు.

ప్రతిసారీ కొత్త అభ్యర్థితోనే...

గత ఐదు సార్వత్రిక ఎన్నికలను పరిశీలిస్తే ఐదుసార్లు కొత్త అభ్యర్థులతో తలపడడం విశేషం. 2004లో మార్టూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి వరుసకు సోదరుడైన గొట్టిపాటి నర్సయ్య, 2009లో అద్దంకి నియోజకవర్గం నుంచి అప్పటి టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిపై, 2014లో వెంకటేష్‌పై, 2019లో వైసీపీ తరపున పోటీ చేసిన బాచిన గరటయ్యపై విజయం సాధించారు. 2024లో పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం నుంచి వచ్చి పోటీ చేసిన పాణెం చినహనిమిరెడ్డిపై విజయం సాధించారు. ఇలా పోటీ చేసి గెలిచిన ఐదు సార్లు ప్రత్యర్థులు మాత్రం వేర్వేరుగా ఉన్నారు.

24,890 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించిన గొట్టిపాటి

అద్దంకి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ 24,890 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. మొత్తం 22 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగగా గొట్టిపాటి పోస్టల్ ఓట్లతో కలిపి 1,16,418 ఓట్లు సాధించగా, వైసీపీ అభ్యర్థి పాణెం చినహనిమిరెడ్డి 91,528 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి అడుసుమల్లి కిషోర్ 4072 ఓట్లు సాధించారు. పంచాయతీల వారీగా పరిశీలిస్తే ఫైలవరంలో టీడీపీకి 20, వెంపరాల లో 432, చక్రాయపాలెం 72, గోవాడలో 207, చినకొత్తపల్లిలో 192, కలవకూరులో 179, బొమ్మనంపాడులో 673, గోపాలపురంలో 110, జార్లపాలెంలో 47, నాగులపాడులో 498, వేలమూరిపాడులో సమానం, కొంగపాడులో 135, తిమ్మాయపాలెంలో 367, కొటికలపూడిలో 249, కుంకుపాడులో 66, పేరాయపాలెంలో 143, ధేనువకొండ (రెండు పునరావాస కాలనీలతో కలిపి) 851 ఓట్ల మెజార్టీ సాధించింది. ఇక వైసీపీ మోదేపల్లిలో 7, రామాయపాలెంలో 104, విప్పర్లవారిపాలెంలో 98, మణికేశ్వరంలో 376, వెంకటాపురంలో 421, శింగరకొండపాలెంలో 142, శంఖవరప్పాడులో 678, ధర్మవరంలో 118, ఉప్పలపాడులో 126 ఆధిక్యం సాధించింది.

పట్టణంలోనూ ఆధిక్యం

అద్దంకి పట్టణ ఓటర్లు టీడీపీకి భారీ ఆధిక్యం అందించారు. మొత్తం 31 పోలింగ్ బూత్‌లు ఉండగా మూడు పోలింగ్ బూత్‌లలో మాత్రమే వైసీపీకి స్వల్ప ఆధిక్యం వచ్చింది. మిగిలిన 28 పోలింగ్ బూత్‌లలో టీడీపీకి ఆధిక్యం వచ్చింది. అద్దంకి పట్టణంలో5,957 ఓట్లు ఆధిక్యం వచ్చింది. అత్యధికంగా 163 పోలింగ్ బూత్‌లో టీడీపీకి 467 ఓట్లు ఆధిక్యం వచ్చింది. వైసీపీ కి 151 పోలింగ్ బూత్‌లో69, 160లో 16,173లో 70 ఓట్లు ఆధిక్యం వచ్చింది. ఇక మిగిలిన అన్ని బూత్‌లలో టీడీపీకి ఆధిక్యం వచ్చింది. 146 పోలింగ్ బూత్‌లో 170, 147లో 196, 148లో 220, 149లో 35, 150లో 245, 152లో 190, 153లో 205, 154లో 262, 155లో 194, 156లో 43, 157లో 13, 158లో 369, 159లో 28, 161లో 128, 162లో 204, 153లో 467, 164లో 325, 165లో 58, 166లో 432, 167లో 255, 168లో 308, 169లో 383, 170లో 216, 171లో 253, 172లో 428, 174లో 80, 175లో 192, 176 పోలింగ్ బూత్‌లో 213 ఓట్లు టీడీపీకి ఆధిక్యం వచ్చాయి. దీంతో అద్దంకి మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులలో 5,957 ఓట్లు ఆధిక్యం వచ్చింది.

బల్లికురవ మండలంలో భారీ మెజారిటీ

మండలంలో టీడీపీ పార్టీకి ఈ ఎన్నికలలో భారీ మెజారిటీ వచ్చింది. ఈసారి 21 పంచాతీలలో 19 పంచాయతీలలో టీడీపీ నాలుగు వేల పైచిలుకు మెజారిటీ సాధించింది. గత 2019 ఎన్నిలలో టీడీపీ కేవలం 539 ఓట్లు మెజారిటీ సాధించగా ఈసారి మాత్రం ఎమ్మెల్యే రవికుమార్‌కు అత్యధిక శాతం మంది ఓటర్లు ఓట్లు వేశారు. గతంలో ఎన్నడు లేని భారీ మెజారిటీ వచ్చిందని టీడీపీ శ్రేణులు తెలిపారు. గ్రామాలవారీగా టీడీపీ వచ్చిన మెజారిటీలు ఇలా ఉన్నాయి. కొప్పెరపాలెం, 91, ఉప్పుమాగులూరు, 347, వేమవరం, 282, కె.రాజుపాలెం, 568, కొణిదెన, 254, మల్లాయపాలెం, 253, కొండాయాలెం, 170, బల్లికురవ, 42, చెన్నుపల్లి, 170, నక్కబొక్కలపాడు, 346, గుంటుపల్లి, 452, ముక్తేశ్వరం, 128, ఎస్ఎల్ గుడిపాడు, 138, వైదన,341, కొప్పెరపాడు, 27, గొర్రెపాడు, 371, వెలమవారిపాలెం, 20, కొత్తూరు, 141, కొమ్మినేనివారిపా లెం, 227, అంబడిపూడి, 156 ఓట్ల మెజారిటీలు వచ్చాయి. వైసీపీకి వల్లాపల్లిలో 74, కూకట్లపల్లిలో 213 ఓట్ల మెజారిటీ వచ్చింది. మండలంలో టీడీపీకి మెజారిటీలు వచ్చిన గ్రామాలలో మెదటిగా కె. రాజుపాలెం, రెండోదిగా గుంటుపల్లి గ్రామాలు నిలిచాయి. ఊహించని విధంగా టీడీపీకి 19 గ్రామాలలో మెజారిటీలు రావటంతో టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికలలో వైసీపీకి మెజారిటీలు వచ్చిన గ్రామాలలో ఈసారి టీడీపీకి భారీ మెజారిటీలు రావటం విశేషం.

వైవీకి సొంత మండలంలో ఝలక్

మేదరమెట్ల, జూన్ 5 : కొరిశపాడు మండలంలో మూడు మేజర్ పంచాయతీలు ఉన్నాయి. అందులో మేదరమెట్ల, రావినూతల, పమిడిపాడు ఉన్నాయి. రావినూతల పమిడిపాడులో ఎప్పుడు టీడీపీకే మెజార్టీ లభిస్తుంది. గత రెండు ఎన్నికలల్లో వైసీపీకి స్వల్ప మెజార్టీ వచ్చింది. మేదరమెట్ల మేజర్ పంచాయతీలోనే టీడీపీకి 700కి పైగా మెజార్టీ వచ్చింది. దీనికి తోడు 800కి పైగా వైసీపీకి మెజార్టీ వస్తుందని అనుకున్న కొరిశపాడులో 307 ఓట్ల మెజార్టీకే పరిమితమైంది. దీనికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గాలితో సంబంధం లేకపోయినా స్థానికంగా ఉన్న కారణాలవల్లే మెజార్టీ తగ్గినట్లు భావిస్తున్నారు. ఎర్రం చిన్న పోలిరెడ్డి పేరుతో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పనులు అడుగు ముందుకు పడలేదు. దీనిని వైవీ సుబ్బారెడ్డి పట్టించుకోలేదనే మిగతా మేజర్ పంచాయతీలు రావినూతల, పమిడిపాడులో గతంలో కన్నా మెజార్టీ పెరిగింది. మొత్తం మీద కొరిశపాడు మండలంలో అనుకున్నదానికన్నా ఎక్కువ మెజార్టీ వచ్చినట్లు తెలుస్తుంది.

గ్రామాల్లో టీడీపీ శ్రేణుల సంబరాలు

బల్లికురవ, జూన్ 5 : టీడీపీ ఎన్నికలలో విజయం సాధించడంతో పార్టీ శ్రేణులు అన్ని గ్రామాలలో సంబరాలు నిర్వహించారు. గొట్టిపాటి గెలుపొందడం వారి ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. జై టీడీపీ, సీఎం చంద్రబాబు అంటూ జేజేలు కొట్టారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి, మాజీ మంత్రి దివంగత గొట్టిపాటి హనుమంతురావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బాబు చిత్రపటానికి పాలభిషేకం

పంగులూరు, జూన్ 5 : పంగులూరు ఎస్సీ కాలనీలో టీడీపీ మండలాధ్యక్షుడు రావూరి రమేష్ ఆధ్వర్యంలో బుధవారం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. అలాగే ఎమ్మెల్యేగా గొట్టిపాటి గెలవడంపై మండలంలోని అన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కేక్‌లు కట్ చేయడంతోపాటు మిఠాయిలు పంచిపెట్టారు. గ్రామ మాజీ సర్పంచ్ బాచిన నీరజశ్రీనివాస్, టీడీపీ నాయకులు చిలుకూరి గోపీ రాణి ప్రసాదనాయుడు కేక్ కట్ చేశారు.

రెండు గ్రామాలలో పోలీసు పికెట్‌లు

బల్లికురవ, జూన్ 5 : మండలంలోని కొప్పెరపాలెం, వైదన గ్రామాలలో ఎన్నికల కౌంటింగ్ ముగిసిన అనంతరం మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణల నేపథ్యంలో బుధవారం పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. రెండు గ్రామాలలో అల్లర్లు పెద్దవి కాకుండా సీఐ ఆదేశాల మేరకు పీకెట్ పెట్టామని ఎవరైన ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అని ఎస్ఐ హెచ్చరించారు.

బాబు కోసం ఉప్పుమాగులూరు నుంచి విజయవాడకు పాదయాత్ర

బల్లికురవ, జూన్ 5 : చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని మొక్కుకున్న ఉప్పుమాగులూరు మాజీ సర్పంచ్ అమరనేని అంజనాదేవీ కాశీ విశ్వనాథం బుధవారం పాదయాత్రగా విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయానికి బయలుదేరారు. టీడీపీ కూటమికి 144 సీట్లు రావాలని మూడు మసాల నుంచి కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కాశీవిశ్వనాథం ఎన్నికల ఫలితాలలో టీడీపీకి భారీ మెజారిటీ రావడంతోపాటు అద్దంకి ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్ ఐదోసారి గెలుపొందడంతో ఉప్పుమాగులూరు గ్రామం నుంచి పాదయాత్రగా మొక్కులు తీర్చుకునేందుకు విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయానికి బయలుదేరారు. శుక్రవారం సాయంత్రానికి అమ్మవారి దేవాలయానికి చేరి మొక్కు తీర్చుకుంటానని ఆయన తెలిపారు. ఆయనతోపాటు పలువురు మహిళలు పాదయాత్రగా తరలి వెళ్లారు.

గొట్టిపాటికి మంత్రి పదవిపై క్యాడర్‌లో జోరుగా చర్చ

అద్దంకి, జూన్ 5 : వరుసగా ఐదుసార్లు విజయం సాధించిన నేతగా గొట్టిపాటికి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో గొట్టిపాటికి మంత్రి మండలిలో బెర్త్ ఖాయమనే అభిప్రాయం శ్రేణులలో చర్చ కొనసాగుతోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గొట్టిపాటిని టార్గెట్ చేసి ఆర్థిక మూలాలపై దెబ్బ కొట్టారు. అంతటితో ఆగకుండా గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీలను మూసివేయించి ఐదేళ్లగా వేధించారు. వీటన్నింటినీ తట్టుకొని నిలబడిన గొట్టిపాటి టీడీపీ క్యాడర్‌కు, ప్రజలకు అందుబాటులోనే ఉన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నేతలను సమన్వయ పరిచి ముందుకు నడిపించడంలో కూడా గొట్టిపాటి కీలకంగా వ్యవహరించారు. ఐదోసారి విజయం సాధించిన గొట్టిపాటి రవికుమార్‌ను నియోజకవర్గానికి టీడీపీ శ్రేణులు, గొట్టిపాటి అభిమానులు బుధవారం చిలకలూరిపేటలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో బుధవారం ఉదయం నుంచే చిలకలూరిపేటలో గొట్టిపాటి నివాసం టీడీపీ క్యాడర్‌తో కిటకిటలాడింది.

శింగరకొండకు నడిచి వెళ్లిన టీడీపీ నేతలు

అద్దంకి, జూన్ 5 : టీడీపీ కూటమి ఘన విజయం సాధించటం, అద్దంకి నియోజకవర్గం నుండి గొట్టిపాటి విజయకుమార్ భారీ మెజార్టీ తో విజయం సాధించటం తో అద్దంకి పట్టణంలోని 20 వ వార్డు కు చెందిన టీడీపీ నేత కోనేటి అనిల్ ఆధ్వర్యంలో యువత బుధవారం సాయం త్రం అద్దంకి నుండి శింగరకొండ కు నడిచి వెళ్లి ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా యన్‌టిఆర్ నగర్ లో కేక్ కట్ చేశారు. బాణసంచా కాల్చారు. టీడీపీ నేతలు కోనేటి అనిల్, గోవిందు, వెంకటరావు, ఏసు, గోపి, బ్రహ్మం, దుర్గ, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


శింగరకొండకు నడిచివెళ్తున్న టీడీపీ శ్రేణులు

టీడీపీ శ్రేణుల విజయోత్సవ ర్యాలీ

ఇంకొల్లు, జూన్ 5 : టీడీపీ కూటమి విజయంతో బుధవారం శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పార్టీ కార్యాలయం నుంచి స్థూపం సెంటర్ మీదుగా సినిమాహాలు కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

అభివృద్ధే లక్ష్యంగా పాలన

» ఎమ్మెల్యే ఏలూరి » సాంబశివరావుకు అభినందనల వెల్లువ

పర్చూరు, జూన్ 5 : ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రజా కూటమి పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. బుధవారం మార్టూరు మండలం ఇసుకదర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఏలూరికి అభినందనలు వెల్లువెత్తాయి. పర్చూరు నియోజకవర్గంలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లి ఏలూరికి పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయమన్నారు. ఇంతటి భారీ మెజార్టీని ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బొమ్మల సెంటర్‌లో ఎన్టీఆర్, వంగవీటి విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.


శ్రేణులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఏలూరి

101 కొబ్బరికాయలు కొట్టిన తెలుగు మహిళలు

మార్టూరు : ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించిన ఏలూరి సాంబశివరావును బుధవారం ఇసుకదర్శి ఏలూరి క్యాంప్ కార్యాలయంలో కలిసి మార్టూరు తెలుగు మహిళలు అభినందనలు తెలిపారు. అనంతరం వారందరూ జిల్లా సరిహద్దు బొప్పూడి అంజనేయస్వామి గుడికి వెళ్లి ధ్వజ స్తంభం వద్ద 101 కొబ్బరి కాయలుకొట్టి తమ మొక్కు తీర్చుకున్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో అమరావతి రాజధానిగా అభివృద్ధి చెందాలని స్వామికి మొక్కుకున్నారు.


కొబ్బరికాయలు కొడుతున్న మార్టూరు మహిళలు

గన్నవరంలో ఏలూరి విజయోత్సవ ర్యాలీ

యద్దనపూడి : గన్నవరంలో బుధవారం టీడీపీ నాయకులు ఏలూరి గెలుపుపై విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. 24వేల భారీ మెజారిటీతో ఏలూరి విజయం సాధించడంతో నాయకులు, కార్యకర్తలు ఆనందంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నల్లపనేని రంగయ్యచౌదరి, జడ్పీటీసీ సభ్యులు లక్ష్మీనారాయణమ్మ, ఎంపీటీసీ సభ్యులు గొట్టిపాటి సతీష్ కుమార్, సుబ్బారావు, దూళ్లిపాళ్ల సుబ్బారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దూళ్లిపాళ్ల హరిబాబు, రామకృష్ణ, లోకేష్ రెడ్డి, ఆరేరాఘవరెడ్డి, చెరుకూరి సురేంద్ర పాల్గొన్నారు.

నీట్‌లో మెరిసిన కానిస్టేబుల్ కుమార్తె


హేమశ్రీ

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జూన్ 5 : ఆల్ ఇండియా మెడిసిన్ ఎంట్రన్స్ టెస్ట్ నీట్-2024లో ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న హేమచంద్రకుమార్తె హేమశ్రీ మెరిసింది. 720కు గాను 597 మార్కులు సాధించారు. వీరిది వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి స్వగ్రామం. హేమశ్రీ తల్లి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పలువురు ఆమెను అభినందించారు.

ప్రతిభ చాటిన పూర్ణిమ

పంగులూరు : కొండమంజులూరుకు చెందిన కరణం పూర్ణిమ నీట్ పోటీ పరీక్షలో 704వ ర్యాంక్ సాధించింది. దేశ వ్యాపితంగా జరిగిన పోటీ పరీక్షలో ప్రతిభ చాటిన పూర్ణిమను మంగళవారం పలువురు అభినందించారు. పాఠశాల విద్యను ఒంగోలులో పూర్తి చేసిన పూర్ణిమ ఇంటర్ విద్యను శ్రీ గోసాలైట్స్‌లో పూర్తి చేసింది. ఆలిండియా స్థాయి పోటీ పరీక్షలో ర్యాంక్ సాధించిన పూర్ణిమకు వైద్య విద్య అభ్యసనకు ఎయిమ్స్‌లో సీటు లభిస్తుందని పూర్ణిమ ధీమా వ్యక్తం చేసింది.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

బల్లికురవ, జూన్ 5 : కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్ పరీక్షలో కొప్పెరపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పది మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వారిలో బాపట్ల జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో కొప్పెరపాడుకు చెందిన విద్యార్థి నలజర్ల కీర్తన నిలిచారు. రెండోస్థానంలో అదే పాఠశాలకు చెందిన గుంటకల కోటేశ్వరరావు నిలిచాడు. బుధవారం పాఠశాల ఇన్‌చార్జి హెచ్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ దమ్ము అంజయ్య విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి

అద్దంకిటౌన్, మే 5 : గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగపర్చుకోవాలని గ్రంథపాలకుడు సీహెచ్ సుగుణరావు అన్నారు. బుధవారం అద్దంకి గ్రంథాలయ శాఖ కార్యాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను వీరరాజు, డ్రాయింగ్ మాస్టర్ కత్తి బాలకోటేశ్వరరావు, మందా జోసఫ్ తదితరులు సందర్శించారు. విద్యార్థులకు టెల్లింగ్ డ్రాయింగ్ నేర్పించారు.

హమ్మయ్య.. గట్టెక్కాం..!

- ఊపిరిపీల్చుకున్న అధికార యంత్రాంగం
- విజయవంతంగా ఎన్నికల ప్రక్రియ పూర్తి



ఎన్నికల ప్రక్రియ ముగియంతో ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంలు, ఇతర సామగ్రిని తరలిస్తున్న సిబ్బంది

నెల్లూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : అత్యంత ప్రతిష్ఠాత్మకమైన, క్లిష్టమైన ఎన్నికల క్రతువును జిల్లా అధికార యంత్రాంగం విజయవంతంగా పూర్తి చేసింది. దాదాపు రెండున్నర నెలలకుపైగా జరిగిన ఈ ఎన్నికల ప్రక్రియలో ఎక్కడా పొరపాట్లు దొర్లకుండా అడుగడుగునా జాగ్రత్తలు తీసుకుంది. రాజకీయ పార్టీల నుంచి విమర్శలు వచ్చినా అన్నిటినీ ఓపిగ్గా పరిష్కరించుకుంటూ ముందుకు సాగింది. దాదాపు 18 వేలకుపైగా సిబ్బంది ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములయ్యారు. కొన్నిచోట్ల సమస్యలు ఏర్పడినా సిబ్బంది సహనం కోల్పోకుండా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించారు. మార్చి 16వ తేదీన ఎన్నికల షెడ్యూల్ వెలువడిన రోజు నుంచి జూన్ 4వ తేదీ కౌంటింగ్ పూర్తయ్యే వరకూ జిల్లా ఎన్నికల యంత్రాంగం పకడ్బందీగా వ్యవహరించింది. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఎప్పటికప్పుడు కింది స్థాయి సిబ్బందికి పంపుతూ, వాటిపై అవగాహన కల్పిస్తూ ఆ ఆదేశాలు పటిష్ఠంగా అమలయ్యేలా ఉన్నతాధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌తోపాటు ఎస్పీ ఆరీఫ్ హఫీజ్‌లు ముందుండి ఈ ప్రక్రియను నడిపించారు. వీరికి సీనియర్ ఐఏఎస్ అధికారులైన అబ్బర్వర్లు తోడవడంతో ఎక్కడా పొరపాట్లు దొర్లలేదు.

కొత్తవారు అయినా..!

జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలతోపాటు నెల్లూరు పార్లమెంటుకు రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించిన వారిలో చాలా వరకు కొత్తవారే. పార్లమెంటు స్థానానికి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించడం కలెక్టర్ హరినారాయణన్‌కు తొలిసారి కాగా, అసెంబ్లీ స్థానాలకు ఆర్‌వోలుగా వ్యవహరించడం జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, కమిషనర్, ఆత్మకూరు ఆర్డీవోకు తొలిసారి. అయినా జిల్లాలో పలువురు సీనియర్ అధికారులు గతంలో ఎన్నికల్లో పనిచేసిన అనుభవం ఉన్న వారు ఉండటంతో వారు ఆర్‌వోలకు పూర్తిగా సహకారం అందించారు. ఈ కారణంగానే పోలింగ్ రోజు ఎక్కడా వివాదాలు తలెత్తలేదు. 2019 ఎన్నికల్లో జిల్లాలో రెండు చోట్ల రీపోలింగ్ జరిగింది. ఈదఫా రీపోలింగ్‌కు అవకాశమే లేకుండా పకడ్బందీగా పోలింగ్ నిర్వహించారు.

ఉద్యోగులూ శభాష్

ఎన్నికల ప్రక్రియ విజయంతంగా పూర్తి కావడంలో ప్రభుత్వ ఉద్యోగులు కీలకంగా వ్యవహరించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన మొదలు కౌంటింగ్ వరకూ వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించారు. పోలింగ్ ముందు రోజు కేంద్రాల వద్దకు చేరుకున్నప్పటికీ చాలా చోట్ల స్నానాలు చేసేందుకు సరైన వసతులు లేవు. కొన్నిచోట్ల సకాలంలో మంచినీరు, భోజనం దొరక లేదు. అయినా వీటన్నింటినీ భరించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల విషయంలోనూ కొన్నిచోట్ల గందరగోళం తలెత్తినా ఓపిగ్గా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిశాక ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చేందుకు ఆలస్యమైనా ఎక్కడా సహనం కోల్పోలేదు. రాజకీయంగా ఏ చిన్న విమర్శ రాకుండా ఉద్యోగులు తమ బాధ్యతలు నిర్వర్తించారు.

నేటితో ముగియనున్న కోడ్

ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఓట్ల లెక్కింపు పూర్తయిన 48 గంటల వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. ఆ తర్వాత దానిని ఎత్తి వేస్తూ గజిట్ విడుదల చేస్తారు. దీంతో రెండున్నర నెలలకుపైగా కొనసాగిన ఎన్నికల కోడ్ గురువారం ముగియ నుంది. శుక్రవారం నుంచి సాధారణ జీవనం సాగించుకోవచ్చు. కోడ్ ఎత్తివేతపై అధికారులు అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది.



అందరికీ కృతజ్ఞతలు


సార్వత్రిక ఎన్నికలు విజయవంతమయ్యేందుకు అధికారులు, ఉద్యోగులు, రాజకీయ పార్టీల నేతలు, ప్రజలు ఎంతో సహకరించారు. వీరందరికీ కృతజ్ఞతలు. ఎన్నికల ప్రక్రియలో చిన్న పొరపాటు కూడా తలెత్తకుండా సిబ్బంది నిబద్ధతతో పనిచేశారు. చిన్న అవాంఛనీయ ఘటన కూడా జరగకుండా పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు నిర్వహించింది. ఇదే నిబద్ధతను యంత్రాంగం కొనసాగించాలని కోరుకుంటున్నా.

- ఎం హరినారాయణన్,
జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్

అభ్యర్థులకు 'నో'టా!

- ఓటుతో వ్యతిరేకత చాటిన ఓటర్లు
- అసెంబ్లీకి 14,886 ఓట్లు
- నెల్లూరు పార్లమెంట్‌కు 15,577 ఓట్లు

నెల్లూరు (విద్య) : ప్రజాస్వామ్యంలో ఓటర్లకు కల్పించిన హక్కుల్లో నోటా కూడా ఒకటి. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులెవరూ నచ్చకపోతే నోటా మీద నొక్కి తనకెవరూ నచ్చలేదని సంకేతాలను అందించే అధికారం ఓటర్లకు ఉంది. దీనిపై ఓటర్లకు అవగాహన పెరగడంతో ఎన్నికల సమయంలో ఈ నోటాపై మొగ్గు చూపించే వారి సంఖ్య పెరిగిపోయింది. ప్రస్తుత ఎన్నికల్లో 30,463 మంది పోటీలో ఉన్న అభ్యర్థులను నోటాతో తిరస్కరించారు. నెల్లూరు పార్లమెంట్‌కు 15 మందిచ 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 115 మంది పోటీలో నిలిచారు. వీరికి వచ్చిన ఓట్ల గణాంకాలను పరిశీలిస్తే పార్లమెంట్‌కు 15,577 మంది, అసెంబ్లీలకు 14,886 మంది కలిపి మొత్తం 30,463 మంది ఓటర్లు నోటాకు జై కొట్టారు. అలాగే పార్లమెంట్‌తోపాటు అన్ని నియోజకవర్గాల్లోనూ బ్యాలెట్ నోటా ఓట్లు ఉన్నాయి. నెల్లూరు పార్లమెంట్‌లో 123, కోవూరులో 16, ఆత్మకూరులో 11, ఉదయగిరిలో 9, సర్వేపల్లిలో 5, కావలిలో 22, నెల్లూరు రూరల్‌లో 44, కందుకూరులో 15, నెల్లూరు నగరం లో 23 నోటా ఓట్లు పోలయ్యాయి. మొత్తం మీద పోస్టల్ బ్యాలెట్‌ల ద్వారా కూడా 268 మంది ఉద్యోగులు నోటా నొక్కారు.



నియోజకవర్గాల వారీగా నోటాకు వచ్చిన ఓట్లు

నియోజకవర్గం	పోలైన ఓట్లు	నోటా
కోవూరు	2,12,084	2,377
ఆత్మకూరు	1,79,819	2,347
ఉదయగిరి	1,98,086	2,072
సర్వేపల్లి	1,93,913	2,052
కావలి	1,96,402	2,030
నెల్లూరురూరల్	1,89,769	2,016
కందుకూరు	2,04,202	1,025
నెల్లూరుసిటీ	1,71,765	967
నెల్లూరు (ఎంపీ)	13,60,072	15,577



మొదటి విజేతను ప్రకటిస్తున్న ఆంధ్రజ్యోతి సిబ్బంది

'ఎవరు గెలిచినా మీదే గెలుపు'

విజేతలు వీరే!

- గూడూరు వాసికి మొదటి బహుమతి
- ముగ్గురికి ద్వితీయ బహుమతి
- ఆంధ్రజ్యోతి కార్యాలయంలో లక్కీడ్రా

నెల్లూరు (సాంస్కృతికం) : 'శాసనసభ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు?' అనే అంశంపై ఆంధ్రజ్యోతి- నిర్వహించిన లక్కీడ్రాకు పాఠకుల నుంచి విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లో ఏ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొందుతుందో పాఠకుల నుంచే అంచనాలు వేస్తూ కూపన్లు స్వీకరించింది. అలా వచ్చిన వేలాది కూపన్లలో బుధవారం సాయంత్రం నెల్లూరులోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. గూడూరులోని హాస్పిటల్ రోడ్డులో ఉన్న ముంగర రవి అనే చందాదారుడు ప్రథమ బహుమతి కింద 10వేల రూపాయలు గెలుచుకున్నారు. అలాగే మూడు ద్వితీయ బహుమతులను నెల్లూరులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన పి.గాయత్రి, వేదాయపాళెం త్యాగరాజనగర్‌కు చెందిన తోటపల్లి వెంకటసుబ్రహ్మణ్యం, సూళ్లూరుపేటకు చెందిన వంకా రఘురామయ్య విజేతలుగా నిలిచారు. వీరికి రూ.5వేలు చొప్పున బహుమతిని త్వరలో అందజేస్తారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజరు కే.హరికృష్ణ, ఎడిషన్ ఇన్‌చార్జి జి.రామకృష్ణ, సర్క్యులేషన్ ఇన్‌చార్జి ఆర్.నాగేశ్వరరావు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజరు రహీం, ఆంధ్రజ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.

దిగజారిన పొగాకు ధరలు

- రూ.350 నుంచి 330కి తగ్గిన వైనం
- ఆందోళనలో రైతులు

కలిగిరి: గతేడాది పొగాకు సాగు చేసిన రైతులకు కొనుగోళ్ల చివర్లో ధరలు పెరిగి లాభాలు తెచ్చి పెట్టాయి. 2022-23 పంట కాలంలో కలిగిరి వేలం కేంద్రంలో పొగాకు గరిష్ఠ ధర రూ.280 పలకగా, ఈ ఏడాది ప్రారంభం నుంచే రూ.230 నుంచి రూ.350 వరకు గరిష్ఠ ధర నమోదైంది. క్రమేపీ ధరలు పెరుగుతూ రావడం చూసి రైతులు తమవద్ద ఉన్న పొగాకును కొనుగోళ్ల చివర్లో విక్రయిస్తే మంచి ధర పలుకుతుందని ఎదురుచూస్తున్నారు. అయితే గత శనివారం కేజీ రూ.350 ధర పలికే సరికి రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే తరువాత రోజు నుంచి రూ.20 మేర తగ్గించి రూ.330లకే కొనుగోలు చేస్తుండటంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక బేలుకి 150కేజీల వంతున పొగాకు బోర్డులో అమ్మకాలు జరుపుతున్న రైతులు తగ్గిన ధరతో ఒక్కొక్క బేలుకు రూ.3వేల మేర తాము నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఇళ్లవద్ద ఇంకనూ 2మిలియన్ల కేజీలకు పైగా నిల్వలు ఉన్నాయని, కొనుగోలు కంపెనీ ప్రతినిధులతో బోర్డు అధికారులు సమావేశం నిర్వహించి, ధరలు తగ్గుముఖం పట్టకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

కూటమి శ్రేణుల సంబరాలు

ఆత్మకూరు, జూన్ 5: నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి విజయం సాధించడంతో స్థానిక బీఎస్ఆర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విజయోత్సవ సంబరాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చి కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని చిందులు వేశారు. సీఎం చంద్రబాబునాయుడు, ఆనం రామనారాయణరెడ్డి జయహో అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల చంద్రారెడ్డి, పల్లవోలు జయాకర్, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సుంకర పెంచలచౌదరి, కేతా విజయభాస్కర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇందూరు వెంకటరమణరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దావా పెంచలరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చంద్రా వెంకసుబ్బానాయుడుతో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.


ఆత్మకూరులో సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సీతారామపురం: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో తిరుగులేని ఫలితాలు రావడంతో టీడీపీ మండల శ్రేణులు మండలకేంద్రంలోని బస్టాండ్ సెంటర్, బసినేనిపల్లి గ్రామాల్లో రంగులు పూసుకొని కేక్ కట్ చేసి సంబరాలు చేసుకొన్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు మాట్లాడారు. చంద్రబాబు నాయకత్వంలో మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు అర్హులైన అందరికీ అందుతాయన్నారు. కాకర్ల సురేష్‌కు ఘన విజయం అందించిన మండల తెలుగుదేశం, జనసేన కార్యకర్తలకు పార్టీ అన్ని రకాలుగా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ భోగినేని కాశిరావు, జిల్లా ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి జాషువా, వెంకటేశ్వర్లు, ఇజ్రాయిల్, చెన్నకేశవులు, తూరక వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ కొడవటికంటి కిరణ్, నాగేశ్వరావు మాలకొండయ్య, మనోజ్, గౌస్, జయరాములు పాల్గొన్నారు.


సీతారామపురంలో సంబరాలు చేసుకుంటున్న తెలుగు తమ్ముళ్లు

రాక్షస పాలనకు చరమగీతం

ఉదయగిరి రూరల్: రాష్ట్రంలో రాక్షసపాలను సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు అంతమొందించారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ తెలిపారు. బుధవారం స్థానిక కావలి మార్గంలోని ఎస్టీ కాలనీలో టీడీపీ నాయకులు నిర్వహించిన సంబరాల్లో పాల్గొని ఆయన కేక్ కట్ చేసి మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి లేకపోవడంతో ప్రజల కడుపుమండి వైసీపీ ప్రభుత్వ నియంత పాలనకు చరమగీతం పాడారన్నారు. రాష్ట్రంలో టీడీపీ కూట మి సునామీ సృష్టించిందన్నారు. పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ల ఆధ్వర్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం, నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బయ్యన్న, మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు, నరసింహులు, నల్లిపోగు రాజా పాల్గొన్నారు.

అనంతసాగరం: మండలకేంద్రంతో పాటు సోమశిల గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. బాణాసంచా కాల్చి అభిమానం చాటుకొన్నారు. కార్యక్రమంలో మెట్టుకూరు కృష్ణారెడ్డి, రాపూరు సుబ్బారెడ్డి, మాకిరెడ్డి జనార్ధనరెడ్డి, రాపూరు సుజాతమ్మ, మెట్టుకూరు మనోజ్‌రెడ్డి, శాఖమూరి సుబ్బారావు, ఖాసింబాష, వేగు పెంచలయ్య, గువ్వల పెంచలయ్య పాల్గొన్నారు.


ఉదయగిరిలో కేక్ కట్ చేస్తున్న చెంచలబాబు, నాయకులు


అనంతసాగరంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న నేతలు

కాకర్లకు అభినందనల వెల్లువ

జలదంకి, జూన్ 5 : ఉదయగిరి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కాకర్ల సురేష్‌ను కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి బుధవారం కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. వింజమూరులోని కాకర్ల ట్రస్ట్ కార్యాలయంలో కలిసిన వంటేరును కాకర్ల ఆప్యాయంగా పలకరించి తన విజయానికి దోహదపడడం ఆనందంగా ఉందన్నారు.

● **కలిగిరి:** వింజమూరు పంచాయతీ పరిధి బొమ్మరాజుచెరువు వద్ద గల టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను బుధవారం టీడీపీ కలిగిరి మండల కన్వీనర్ బిజ్జం వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో మండల నాయకులు, కార్యకర్తలు కలసి శుభా కాంక్షలు తెలిపారు. కలిగిరి మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి పథంలో నిలపాలని కోరారు. కాకర్ల మాట్లాడుతూ మెట్టప్రాంతమైన ఉదయగిరికి పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. కలిగిరి మండల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజ్జం కృష్ణారెడ్డి, కట్టా వెంకటేశ్వర్లు, కర్నాటి ప్రభాకర్, పొన్నగంటి శ్రీనివాసులు, కొప్పోలు కొండలరావు పాల్గొన్నారు.

● **కాకర్ల విజయంతో సంబరాలు**

కొండాపురం: ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్ విజయం సాధించడంతో మండలపరిధిలోని అన్ని గ్రామాల్లో బుధవారం పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ప్రతి గ్రామంలోనూ బాణసంచా కాల్చి ర్యాలీలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. కాకర్ల సురేష్‌కు మండల పార్టీ తరపున ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.


జలదంకి : కాకర్లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వంటేరు

అలాగే మండలంలోని పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు వింజమూరులోని కాకర్ల సురేష్ క్యాంపు కార్యాలయానికి వెళ్లి అభినందనలు తెలిపారు.


కలిగిరి : కాకర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న కృష్ణారెడ్డి తదితరులు


కొండాపురం : భీమవరప్పాడులో కేక్ కట్‌చేస్తున్న నాయకులు

పర్యావరణాన్ని కాపాడుకుందాం


ఉదయగిరిలో మొక్క నాటుతున్న సర్పంచి, అటవీ శాఖ అధికారులు

ఉదయగిరి రూరల్, జూన్ 5: ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని కాపాడుకుంటూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని కృష్ణంపల్లి ఎఫ్ఎస్ఓ షేక్ మునీర్ తెలిపారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉదయగిరి అటవీశాఖ రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు వెంగళరావునగర్ సచివాలయం, జిల్లా ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే ప్రకృతికి హాని కలిగించే ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ మొండ్రు తిరుపతి, ఎఫ్‌బీవోలు షేక్ కరీముల్లా, షేక్ అఫ్జల్, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనానికి విద్యార్థుల ఎంపిక

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 5: స్థానిక ఆదర్శపాఠశాల విద్యార్థినులు మధుప్రియ, లక్ష్మీపూజిత, షేక్ ఆఫ్రిన్ నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సైమన్‌రావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 3న నిర్వహించిన పరీక్షలో వారు ప్రతిభ చూపి ఉపకార వేతనానికి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12వేలు చొప్పున నాలుగేళ్ల ప్రభుత్వం అంద జేస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

కాకర్లదే అత్యధిక మెజార్టీ..

ఉదయగిరి రూరల్, జూన్ 5: నియోజకవర్గ ఎన్నికల చరిత్రలో రాజకీయ అనుభవం లేని కాకర్ల సురేష్ విజయం సాధించడంతో పాటు టీడీపీ అభ్యర్థులుగా విజయం సాధించిన వారిలో అత్యధిక మెజార్టీ సాధించిన వ్యక్తిగా కాకర్ల చరిత్రలో నిలిచాడు. 1952లో నందిపాడు కేంద్రంగా ఉదయగిరి నియోజకవర్గం ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటివరకు 17 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 1989లో టీడీపీ అభ్యర్థిగా కంభం విజయరామిరెడ్డి పోటీ చేసి ఓటమి చెందారు. 1999లో టీడీపీ అభ్యర్థిగా కంభం విజయరామిరెడ్డి పోటీ చేసి 4,770 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2014లో బొల్లినేని వెంకటరామారావు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి 3,622 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2024 కాకర్ల సురేష్ 9,621 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఇప్పటివరకు పోటీ చేసిన టీడీపీ అభ్యర్థుల్లో కాకర్లదే అత్యధిక మెజార్టీ కావడం విశేషం.

కాకర్ల సురేష్‌కు అభినందనల వెల్లువ

వింజమూరు: నియోజకవర్గ కూటమి అభ్యర్థి కాకర్ల సురేష్ బుధవారం స్థానిక పార్టీ కార్యాలయానికి రావడంతో అభిమానులు అభినందనలతో ఆనందం వ్యక్తం చేశారు. శాలువాలు, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు చూపించిన ఆధార అభిమానాలను ఎల్లవేళలా కాపాడుకుంటానని తెలిపారు. నియోజవర్గానికి అభివృద్ధి పథంలో నడిపించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తన శక్తిమేర కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. మహిళలు చూపించిన ఆదరాభిమానాలకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కాకర్లను సన్మానించారు.

రోడ్ల మధ్యలో గుంతలతో రాకపోకలకు అవస్థలు

ఉదయగిరి రూరల్, జూన్ 5: పట్టణంలోని నాగులబావి వీధి, సచివాలయం-3 సమీపంలోని ప్రధాన రహదారుల మధ్యలో ఏర్పడిన గుంతలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. దశాబ్దాల క్రితం వేసిన సిమెంట్‌రోడ్లు పూర్తిగా దెబ్బతిని కంకరరాళ్లు తేలి ప్రమాదకరంగా ఉన్నాయి. దీనికితోడు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డుపైన ఉన్న మట్టి మొత్తం కొట్టుకుపోయింది. రాత్రి సమయాల్లో గుంతలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


నాగులబావివీధిలో సిమెంట్‌రోడ్డుపై ఏర్పడ్డ పెద్ద గుంత

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఉరుములు, మెరుపులతో వర్షం

బిట్రగుంట, జూన్ 5: బోగోలు మండలంలో బుధవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్రంగా ఎండ కాసి, ఒక్కసారి వాతావరణం చల్లబడి వర్షం కురిసింది.బోగోలు పంచాయతీ కార్యాలయం వద్ద ఈదురు గాలులకు చెట్లకొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వెంటనే స్పందించిన లైన్‌మన్ రమేష్, స్థానిక వర్కర్ రబ్బాని సంఘటనా స్థలానికి చేరుకుని కొమ్మలు తొలగించి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

వలేటివారిపాలెం : వలేటివారిపాలెంలో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసింది. చిరుజల్లులకే బస్టాండు సెంటరంతా చిత్తడి చిత్తడిగా మారింది. వాతావరణం చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు. ఎండు ముఖం పట్టిన పశుగ్రాసం కురిసిన వర్షంతో జీవం పోసుకుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అల్లూరు : మండలంలో బుధవారం కురిసిన వర్షంతో ప్రజలకు ఉపశమనం లభించింది. ఎండ వేడిని తట్టుకోలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రమంలో ఈ వర్షం ఒకింత ఊరటనిచ్చింది. మూగజీవాలకు సైతం ఈ వర్షం మేలుచేసేలా వాతావరణాన్ని చల్లబరచింది. అయితే వేసవిలో ఉప్పు ఉత్పత్తి చేసే రైతులకు మాత్రం ఈ వర్షం నష్టం చేకూర్చేలా ఉంది. బుధవారం ఈదురుగాలులకుతోడు వర్షం కురవడంతో ఉప్పు రైతులు ఆందోళన చెందారు.


వలేటివారిపాలెంలో కురుస్తున్న వర్షం

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

కావలిటౌన్, జూన్ 5: పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత అని కావలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఈ సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ముసునూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయ ఆవరణలో సీడీపీవో సౌజన్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మొక్కలు నాటారు. అనంతరం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షకు ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలన్నారు. మొక్కలు నాటి వాతావరణాన్ని మెరుగుపర్చేందుకు కృషి చేస్తామని అంగన్‌వాడీలతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ మెంబర్ ఈ సాయిప్రసాద్, లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి, ఏడీపీవో శారద తదితరులు పాల్గొన్నారు.

● **పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ**

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఫైర్ ఆఫీస్ ఎదురుగానున్న పెన్షనర్ల సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు ఆకుల రమణయ్య అధ్యక్షతన పర్యావరణ పరిరక్షణ దినోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ పెన్షనర్లు ఇలాంటి సేవాకార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయన్నారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు రవికుమార్, వెంకయ్య, ఆదిశేషులు, గూడల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కావలి : మాట్లాడుతున్న న్యాయాధికారి సుధాకర్


బిట్రగుంట : మొక్క నాటి నీరు పోస్తున్న ఎఫ్ఆర్వో ఉమామహేశ్వరరెడ్డి

బిట్రగుంట : ప్రతి ఒక్కరూ మొక్క నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకుందామని కావలి ఎఫ్ఆర్వో ఉమామహేశ్వరరెడ్డి అన్నారు. బోగోలు మండలం ముంగమూరు జాతీయ రహదారి పక్కన ఉన్న అటవీశాఖ నగర వనంలో బుధవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. బిట్రగుంట బీట్ ఆఫీసర్ కవిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు పెంచి ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ ఆర్.సుమన్, దగదర్తి బీట్ ఆఫీసర్ రమణయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

గ్రామగ్రామాన ఎమ్మెల్యే నాగేశ్వరావుకు ఘనసన్మానం

వలేటివారిపాలెం, జూన్ 5: కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్వగ్రామమైన బడేవారిపాలెంలో పలువురు టీడీపీ సీనియర్ నాయకులు బుధవారం ఆయన్ను కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సీనియర్ నాయకులు మాదాల మాల్యాద్రి మాట్లాడుతూ కందుకూరులో 20 ఏళ్ల తరువాత టీడీపీకి పూర్వ వైభవం తీసుకరావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పువ్వాడి రమేష్, మాదాల నర్సింగరావు, పువ్వాడి నర్సింగరావు, వలేటి రవి, చుండూరి మాల్యాద్రి తదితరులు ఉన్నారు.

లింగసముద్రం : ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావు గెలుపొందడంతో లింగసముద్రం గ్రామ టీడీపీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్ ఆధ్వర్యంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో గాలంకి ప్రసాద్, అంబేద్కర్‌నగర్, లింగసముద్రం, తిమ్మారెడ్డిపాలెం గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు లింగసముద్రంలోని తిరుమణిశెట్టి కోటయ్య మందిరం వద్ద కోటయ్యస్వామికి 101 కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏ చినసత్యం, నీలం బ్రహ్మారెడ్డి, పొలిమేర చిన నాగిరెడ్డి, సీహెచ్ బ్రహ్మయ్య, పులి వెంకటేశ్వర్లు, అడపా కృష్ణా, రంగయ్య పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

● **టీడీపీకి పట్టం కట్టిన గ్రామాలు**

మండలంలో ఇంటూరి నాగేశ్వరరావుకు గతంలో ఎన్నడూ లేనంతగా 2891 ఓట్ల మెజారిటీ వచ్చింది. చినపవనిలో 1064, వీఆర్ కోటలో 905, లింగసముద్రంలో 578, పెదపవని 446, అంగిరేకులపాడులో 261, పెంట్రాలలో 134 ఓట్ల మెజారిటీ టీడీపీ వచ్చింది.

కందుకూరు : కందుకూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఇంటూరి నాగేశ్వరరావుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం ఉదయం నుంచే ఆయన స్వగ్రామమైన బడేవారిపాలెంలో నివాసం వద్దకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత కందుకూరులోని పార్టీ కార్యాలయంలోనూ అభినందనల కార్యక్రమాలకు క్యూ కట్టారు. బుధవారం రాత్రి ఆయన స్వగ్రామమైన బడేవారిపాలెంలో గ్రామస్థులు విజయోత్సవ ర్యాలీ, విందు ఏర్పాటు చేశారు. మరోపక్క బుధవారం కూడా కందుకూరులో టీడీపీ ఘనవిజయాన్ని ఆస్వాదిస్తూ ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకలు జరుపుకున్నారు. ఆలయాల్లో కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. కేకులు కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు.


కందుకూరు : ఓగూరులో ఇంటూరి నాగేశ్వరరావు, చల్లా శ్రీనివాసరావులను గుర్రాలపై ఊరేగిస్తున్న గ్రామస్థులు

● **గుర్రంపై ఊరేగింపు**

ఒంగోలు డెయిరీ మాజీ ఛైర్మన్ చల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆయన స్వగ్రామమైన ఓగూరులో ఇంటూరి నాగేశ్వరరావును గుర్రంపై ఊరేగించి ఘనస్వాగతం పలికారు. మంగళవారం రాత్రి పొద్దుపోయాక ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటూరి నాగేశ్వరరావు, చల్లా శ్రీనివాసరావులను చెరో గుర్రంపై ఎక్కించి పెద్దఎత్తున బాణసంచా కాలుస్తూ డప్పులతో స్వాగతం పలికారు.

ఏడుగురు పందెరాయుళ్ల అరెస్టు

● **రూ.58,760 నగదు, 3 కోళ్ల స్వాధీనం**


అరెస్టు అయిన పందెరాయుళ్లతో పోలీసులు

వలేటివారిపాలెం : మండలంలోని కూనిపాలెం గ్రామ శివారులోని పొలాల్లో బుధవారం కోడిపందెం శిబిరంపై ఎస్ఐ బాలమహేంద్రనాయక్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు ఈ దాడిలో ఏడుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ. 58,760 నగదు, మూడు కోళ్లు స్వాధీనం చేసుకున్నారు అదుపులోకి తీసుకున్న పందెం రాయుళ్లను కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ విజయంతో మొక్కు చెల్లింపు

బిట్రగుంట, (దగదర్తి): టీడీపీ విజయంతో బుధవారం దగదర్తి మండలం పాతూరులోని పోలేరమ్మకు మండల టీడీపీ యువనేత మాలేపాటి భానుచందర్ 101 కొబ్బరకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ గెలుపొందాలని, చంద్రబాబు సీఎం కావాలని కోరిక ఫలించినందుకు మొక్కు తీర్చుకున్నారని తెలిపారు. అనంతరం ఎన్‌టీఆర్ జలసిరి పథకానికి సొంత నిధులతో ఆయన మరమ్మతులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్డే నవీన్‌కుమార్, కంచర్ల కృష్ణ, వీ.గోపాల్, పీ.సూరిబాబు, వీ.కృష్ణ పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనానికి ప్రణీత్ ఎంపిక



కొండాపురం : స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థి వీవీఎస్ ప్రణీత్ జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఖాదర్‌బాషా బుధవారం తెలిపారు.8వ తరగతి చదువుతున్న ప్రణీత్ ఇటీవల వెలువడిన ఫలితాలలో 97 మార్కులు సాధించి ఉపకారవేతనం పొందేందుకు అర్హత సాధించాడన్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు ఏడాదికి రూ.12 వేల నగదు ఉపకారంగా అందుతుందన్నారు. ప్రణీత్‌ను ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

697 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి : స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు మొత్తం 771పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 17కంపెనీ ప్రతినిధులు పాల్గొని 697బేళ్ల కొనుగోలు చేశారు. నోబిడ్-30, ఆర్ఆర్-3, సీఆర్-25, జంపింగ్‌లాట్స్-16 కారణాలతో 74బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో గరిష్ఠ ధర రూ.331, కనిష్ఠ ధర రూ.205, నగటు ధర రూ.290.50గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

ప్రజాసేవకే రాజకీయాల్లోకి వచ్చా : కావ్య


విలేకరులతో మాట్లాడుతున్న కావ్య క్రిష్ణారెడ్డి తదితరులు

కావలి, జూన్ 5 : ప్రజలకు సేవచేయాలనే తలంపుతోనే రాజకీయాలలోకి వచ్చానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు ఎన్నో ఇబ్బందులు, బెదిరింపులు ఎదురైనా, ప్రజలు తనను ఆదరించి గెలిపించారన్నారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా నడచుకుని కావలి అభివృద్ధికి శ్రీకారం చుడతానన్నారు. తాను సంయమనం పాటించడం కావలిలో మెజార్టీ పెంచేందుకు ఉపయోగపడిందన్నారు. పోలీసు వ్యవస్థను ప్రక్షాళన చేసి కావలిలో శాంతిభద్రతలు కాపాడతానన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోతుగంటి అలేఖ్య, మన్నవ రవిచంద్ర, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, పొట్లూరి శ్రీనివాసులు, జ్యోతిబాబూరావు తదితరులు పాల్గొన్నారు.

● **కోలాహలంగా ఎమ్మెల్యే నివాసం**

మంగళవారం అర్ధరాత్రి కావలిలోని తన ఇంటికి చేరుకున్న ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి నివాసం బుధవారం ఉదయం నుంచి అభిమానులతో కిక్కిరిసి పోయింది. ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు కావలి, ఉదయగిరి నియోజకవర్గాల నుంచి అభిమానులు తరలివచ్చారు. అలాగే పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు కూడా ఎమ్మెల్యేను కలిసి బొకేలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో కావ్య నివాసం అభిమానులు, అధికారులతో కోలాహలంగా మారింది.

శాంతిభద్రతలు, అభివృద్ధి పైనే దృష్టి పెడతాం : ఇంటూరి

కందుకూరు, జూన్ 5: రానున్న టీడీపీ పాలనలో కందుకూరు నియోజకవర్గంలో కక్షలు, వేధింపులకు తావు ఉండబోదని, శాంతిభద్రతలను కాపాడటం, అభివృద్ధిపైనే దృష్టిపెట్టి పనిచేస్తామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రకటించారు. బుధవారం రాత్రి స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి, భారీ మెజారిటీ అందించిన కందుకూరు పట్టణ ప్రజలకు శాంతిభద్రతలు సవ్యంగా అందేలా చూస్తామన్నారు. ప్రజలకు ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధికోసం పనిచేస్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు చల్లా శ్రీనివాసరావు, దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, జి.మోషే, రాయపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


లోకేష్‌ను ఆలింగనం చేసుకున్న ఇంటూరి

● **లోకేష్‌ను కలిసిన ఇంటూరి**

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం మంగళగిరి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. లోకేష్‌కు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య తదితరులున్నారు.

మహీధర్‌రెడ్డి ఏంచేశాడో దేవుడికే తెలియాలి : బుర్రా మధు

కందుకూరు : తాజా మాజీ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి ఈ ఎన్నికల్లో పార్టీ విజయంకోసం కృషి చేశాడో... చేయలేదో ? ఆయన అంతరాత్మకు, దేవుడికే తెలియాలని ఆపార్టీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన కందుకూరులో విలేకరులతో మాట్లాడారు. ఆయన పార్టీకి చేయలేదని మావాళ్లు చెబుతున్నారు.. అయితే ఆయన చేశాడో, చేయలేదో నావద్ద ఏ ఆధారాలు లేనందున ఇక ఆ దేవుడికే తెలియాలన్నారు. తెలుగుదేశం కూటమి ప్రభంజనంలో తాను కూడా ఓడిపోయినప్పటికీ 90వేల మంది ఓటర్లు నావెంట నిలిచారని తెలిపారు. వారి రుణం తీర్చుకుంటానన్నారు.